


Truth of News
PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




అనంతపురం | సంపుటి: 03 | సంచిక : 44 | మంగళవారం 22 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఉక్రెయిన్‌పై రష్యా భారీదాడి

**జపోరిజ్జియా సిటీపై డ్రోన్లవర్షం**
**మరో 9 ప్రాంతాలపై కూడా మాస్కో ఎటాక్**



కీవ్ - సూర్య వాస్తవం
ఉక్రెయిన్‌లోని దక్షిణ నగరం జపోరిజ్జియాతో సహా మరో 9 ప్రాంతాలపై కూడా రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, ఓడరేవులతో పాటు ఇతర సైనిక సంబంధిత ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ వైమానిక దాడుల సమయంలో డ్రోన్లు పదేపదే పొరుగు దేశాలైన మోల్డోవాలో, రొమేనియాలోకి ప్రవేశిస్తున్నాయి. 244 ఉక్రేనియన్ డ్రోన్లను రష్యా, 148 డ్రోన్లను ఉక్రెయిన్ తమతమ దేశాల్లో కూల్చివేశాయి. ఈ మేరకు - మిగతా 2లో..

## కేరళలో ప్రకృతి విపత్తు..
## ఐదుగురు మృతి



తిరువనంతపురం- సూర్య వాస్తవం
కేరళలో భారీ వర్షాలు తీవ్రతరం కావడంతో బురద ప్రవాహాలు, కొండచరియలు విరిగి పడటం, ఆకస్మిక వరదలు సంభవించాయి. వేర్వేరు జిల్లాల్లో ప్రకృతి విపత్తులో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. ఇడుక్కిలో షెడ్డుపై కొండచరియలు విరిగిపడి అన్నాచెల్లెలు - మిగతా 2లో..



## అక్టోబర్ 20 నుంచి భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ

**- మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడి**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వచ్చే అక్టోబర్ 20వ తేది నుంచి అధికారికంగా అమల్లోకి రానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ సోమవారం ప్రకటించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని - మిగతా 2లో..

## లోకల్ పోల్స్‌కు కాంగ్రెస్ రెడీ..




- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ కసరత్తు
- రఘువీరారెడ్డి నేతృత్వంలో 10 మందితో మానిటరింగ్ కమిటీ
- జిల్లాల పర్యటనలకు సిద్ధమవుతున్న సీనియర్ నేతలు
- వైసీపీ, టీడీపీ వైపు వెళ్లిన నేతలను తిరిగి రప్పించే యత్నం
- పాత కాంగ్రెస్ శ్రేణులకు కొత్త ఊపునిచ్చే వ్యూహం
- స్థానిక పోరుతో పార్టీకి పునర్వైభవం తెచ్చే ప్రయత్నం
- 10--15 శాతం ఓటు బ్యాంకుపై కాంగ్రెస్ అంచనాలు
- క్షేత్రస్థాయి బలమే పార్టీకి అసలు సవాలు
- రఘువీరా బృందానికి కీలకంగా మారనున్న స్థానిక పోరు
- 2029 లక్ష్యంగా ఇప్పటి నుంచే పక్కా కసరత్తు

విజయవాడ - సూర్య వాస్తవం
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా - మిగతా 2లో..



## ధన ప్రభావంతోనే డీయూలో ఏబీవీపీ గెలుపు

**- అభిజీత్ దీప్కే** 2లో



## తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

**- లింగాల కేదారి, పుష్పలత సేవలు మరువలేనివి**
**- వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్ - సూర్య వాస్తవం
తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. - మిగతా 2లో..

## కదిరి మున్సిపల్ పీఠం ఎవరిది?




- స్థానిక ఎన్నికల సంకేతాలతో కదిరిలో పెరిగిన రాజకీయ వేడి
- 44 వార్డులకు పెరిగిన మున్సిపాలిటీ.. ప్రత్యక్ష చైర్మన్ ఎన్నికపై ఆసక్తి
- 80 వేలకు పైగా ఓటర్లు.. గెలుపు గుర్రాల కోసం పార్టీల వేట
- చైర్మన్ పదవిపై ప్రధాన పార్టీల వ్యూహాత్మక కసరత్తు
- 2014లో టీడీపీ విజయం.. 2021లో వైసీపీ హవా
- 30 వార్డుల్లో వైసీపీ విజయం.. ఐదు స్థానాలకే టీడీపీ పరిమితం
- మారిన రాజకీయ సమీకరణాలతో మళ్లీ రసవత్తర పోరు
- కౌన్సిలర్ల చేరికలతో టీడీపీ బలం పెరిగిందన్న నేతల వాదన
- కదిరి చైర్మన్ పీఠానికి మైనార్టీ అభ్యర్థులకే ప్రాధాన్యం
- 1967 నుంచి ముస్లిం చైర్మన్ల పరంపర కొనసాగుతున్న కదిరి
- చైర్మన్ అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీల్లో తీవ్ర కసరత్తు
- టీడీపీ నుంచి పలువురు ఆశావహులు.. వైసీపీలోనూ భారీ పోటీ
- అభ్యర్థి ఎంపికే పార్టీలకు తొలి పరీక్ష
- పట్టణవ్యాప్తంగా పరిచయం ఉన్న నేతకే చైర్మన్ పీఠం దక్కేనా?
- గత ఫలితాల ప్రభావం.. తాజా రాజకీయ పరిణామాల ప్రభావం ఎంత?
- ఆరు దశాబ్దాల మున్సిపల్ చరిత్రకు మరో ఎన్నికల అధ్యాయం

కదిరి - సూర్య వాస్తవం
ఇటీవల తెలుగుదేశం ప్రభుత్వం అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి అనే సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో కదిరి మునిసిపాలిటీలో ఎన్నికల వేడి ఊపందుకొంది. అందులో ఈసారి చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నిక జరగనుంది. కదిరి మున్సిపాలిటీలో దాదాపు 80000 పైచిలుకు ఓటర్లు ఉన్నారు. అలాగే గతంలో ఉన్న - మిగతా 2లో..

## డీఎస్సీపై దమ్ముంటే అసెంబ్లీకి రండి..

**- దాడులెందుకు? వైసీపీపై చంద్రబాబు ఫైర్**
**- గురువులపై దాడులను చూస్తూ ఊరుకోబోమని సీఎం చంద్రబాబు హెచ్చరిక**
**- డీఎస్సీ నియామకాలపై అభ్యంతరాలుంటే కోర్టుకు వెళ్లాలని సూచన**
**- రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని వ్యాఖ్య**
**- గత ప్రభుత్వమిచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే నియామకాలు జరిగాయన్న సీఎం**
**- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపు**

అమరావతి - సూర్య వాస్తవం



"డీఎస్సీ నియామకాలపై దమ్ముంటే, ఆధారాలుంటే చర్చించడానికి అసెంబ్లీకి రండి.. వాస్తవాలతో మీ నోరు మూయిస్తాం. అంతేగానీ, ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై దాడులు చేయడమేంటి?" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇవాళ విజయవాడలో జరిగిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. గురువులపై 'గొడ్డలి పార్టీ' దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ, నియామక ప్రక్రియపై అభ్యంతరాలుంటే న్యాయస్థానాలను - మిగతా 3లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఉక్రెయిన్‌పై రష్యా భారీదాడి

(మొదటిపేజీ తరువాయి)



అధికారులు సోమవారం తెలిపారు. కీవ్ దళాలు రష్యాపై 1,000కు పైగా డ్రోన్లను ప్రయోగించిన ఒక రోజు తర్వాత ఈ తాజాగా మాస్కో దాడులు చేసింది. అపార్ట్‌మెంట్ బ్లాకులు, షాపింగ్ మాల్‌పై రష్యా దాడి చేసిందని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జపోరిజ్జియాపై రష్యా జరిపిన బాంబు దాడిలో అపార్ట్‌మెంట్ బ్లాకులు, ఒక విశ్వవిద్యాలయం, షాపింగ్ మాల్తో పాటు ఇతర ప్రదేశాలు దెబ్బతిన్నాయని ఐదుగురు గాయపడ్డారని జెలెన్స్కీ సోమవారం సోషల్ మీడియాలో తెలిపారు. ఉక్రెయిన్‌లోని మరో తొమ్మిది ప్రాంతాలపై కూడా రష్యా దాడి చేసిందని ఆయన చెప్పారు.

'రష్యా తన ఉద్రిక్తతను తగ్గించడం లేదని, యుద్ధాన్ని విస్తరించడానికి సిద్ధంగా ఉందని అనేక సంకేతాలు పంపుతోంది' అని జెలెన్స్కీ అన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో, ఉమ్మడి ప్రయత్నాల ద్వారా శాంతిని ఎలా సాధించగలమో చర్చిస్తామని పేర్కొన్నారు. రష్యా సైన్యం రాత్రిపూట ఉక్రెయిన్‌లో లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, ఓడరేవులతో పాటు ఇతర సైనిక సంబంధిత ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం రాత్రి తమ వాయు రక్షణ వ్యవస్థలు రష్యా ప్రాంతాలు, నల్ల సముద్ర జలాలపై 244 ఉక్రేనియన్ డ్రోన్లను కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంతలో, రాత్రిపూట జరిపిన దాడిలో 148 రష్యన్ డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఈ వైమానిక దాడుల సమయంలో డ్రోన్లు పదేపదే పొరుగు దేశాల్లోకి ప్రవేశిస్తున్నాయి. రష్యా పట్ల అప్రమత్తంగా ఉంటూ, సంఘర్షణలోకి లాగబడతామనే భయంతో ఉన్న మోల్డోవాలో దేశ నాయకులను ఇది కలవరపెడుతోంది. సోమవారం అర్ధరాత్రి దాటిన కొద్దిసేపటికే తమ జాతీయ గగనతలంలోకి ఒక 'డ్రోన్' ప్రవేశించినట్లు నిఘా వ్యవస్థలు గుర్తించాయి. దీంతో దేశ ఉత్తర గగనతలంలోని కొంత భాగాన్ని రాత్రికి రాత్రే తాత్కాలికంగా మూసివేసినట్లు మోల్డోవా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రొమేనియా గగనతలంలోకి కూడా డ్రోన్ చొరబాట్లు గణనీయంగా పెరిగాయి.

# కేరళలో ప్రకృతి విపత్తు..
# ఐదుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

మృతి చెందారు. మలప్పురం జిల్లాలో నదిలో స్నానానికి వెళ్లి ఏడుగురు గల్లంతయ్యారు. కొట్టాయంలో మట్టిపెళ్లలు పడి చెన్నై మహిళ ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించాలని ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఆదేశించారు. సతీశన్ సూచన మేరకు, పరిస్థితిని సమీక్షించేందుకు విపత్తు నిర్వహణ అథారిటీ కమిషనర్ విఘ్నేశ్వరి ఇడుక్కి, కొట్టాయం జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించినట్లు జమీా ఒక ప్రకటనలో తెలిపింది. ఇడుక్కి, కొట్టా యంలో వాతావరణ పరిస్థితులపై ఎస్ఎంఎస్ హెచ్చరికలు జారీ చేయగా, పరిస్థితిని అంచనా వేసి, తరలింపుతో సహా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం ఆదేశించారు.

# అక్టోబర్ 20 నుంచి
# భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఒప్పందం అమల్లోకి రానుండటం విశేషమన్నారు. ఇరు దేశాల మధ్య వస్తు, సేవల వాణిజ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు పెట్టుబడులను మరింత విస్తృతపరచడమే లక్ష్యంగా ఈ ఒప్పందాన్ని రూపొందించారన్నారు. గతంలోనే అంటే ఏప్రిల్ 27న ఇరు దేశాలు ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ తాజా ఒప్పందం ద్వారా భారత్ నుంచి ఎగుమతి అయ్యే వస్తువులన్నింటికీ ఎలాంటి సుంకాలు లేకుండా న్యూజిలాండ్ మార్కెట్లోకి ప్రవేశం లభించనుంది. ఇప్పటివరకు సిరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలు వంటి కీలక భారతీయ వస్తువులపై న్యూజిలాండ్ ప్రభుత్వం 10 శాతం వరకు గరిష్ట సుంకాలు విధిస్తూ వస్తోంది. తాజా ఒప్పందంతో ఈ అడ్డంకులు తొలగిపోనున్నాయి. అంతేకాకుండా రాబోయే 15 ఏళ్లలో భారత్‌లో ఏకంగా 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ అంగీకరించింది.

# ధన ప్రభావంతోనే
# డీయూలో ఏబీవీపీ గెలుపు
## - అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ధన ప్రభావంతోనే ఏబీవీపీ విజయం సాధించిందని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే విమర్శించారు. ఏబీవీపీ తరుపున ప్రచారం చేసినవారు విలాసవంతమైన కార్లలో తిరుగుతున్నారని తెలిపారు. ఎన్నికల గురించి విలేకరుల ప్రశ్నలకు అభీజీత్ దీప్కే సమాధానం ఇస్తూ "ఎన్నికల్లో డబ్బు ప్రభావం చూపింది, వేరే ఏమీ కాదు. ఎన్నికల్లో ప్రచారం చేసిన వారు కోట్ల రూపాయల విలువైన కార్లలో వచ్చారు" అని గుర్తు చేశారు. అలాగే, 'మహాత్మా గాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయం' వైస్ ఛాన్సలర్ కుముద్ శర్మ ఆర్ఎస్ఎస్ అనుకూల వ్యక్తి అని తెలిపారు. కుముద్ వీసీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 50 మందికి పైగా విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తెలిపారు. 'కానీ ఒక్క ఏబీవీపీ కార్యకర్తపైనా కేసు నమోదు చేయలేదని, కానీ ఏబీవీపీని వ్యతిరేకించే దళిత, ఆదివాసీ విద్యార్థులపై మాత్రమే కేసులు నమోదు చేస్తారు. విద్యాసంస్థలను ఆర్ఎస్ఎస్ శాఖలుగా మార్చడానికి ఇది ఒక ప్రణాళిక' అని దీప్కే విమర్శించారు. ఇలాంటి పరిస్థితులతో విద్యా వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) చైర్మెన్ వివేక్ భిమాన్వార్ రాజీనామా చేయాలని డిమాండ్‌తో సీజేపీ ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభిస్తున్న తెలిపారు. ఐఐటీ ముంబయిలో విద్యార్థి ఆత్మహత్య ఘటన బాధాకరమని తెలిపారు. 'విద్యా వ్యవస్థపై విద్యార్థులకు నమ్మకం పోవడమే దీనికి కారణం. తమకు అండగా ఎవరూ లేరని భావించడం వల్లే వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు' అని దిప్కే పేర్కొన్నారు.

# లోకల్ పోల్స్‌కు కాంగ్రెస్ రెడీ...

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సవికరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస‌ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభు త్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేవి లేవు. క్షేత్ర స్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎసఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# కదిరి మున్సిపల్ పీఠం ఎవరిది..?



(మొదటిపేజీ తరువాయి)

36 వార్డులను ప్రభుత్వం డిలిమిటేషన్ ద్వారా 44 వార్డులుగా పెంచడం జరిగింది. అలాగే కదిరి మునిసిపాలిటీను స్పెషల్ గ్రేడ్ నుండి సెలక్షన్ గ్రేడ్‌గా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఛైర్మన్ ఎంపిక కావడం జరుగుతుంది. కావున ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం కసరత్తు చేస్తున్నాయి. మునిసిపల్ ఛైర్మన్‌గా విజయం సాధించాలంటే కౌన్సిలర్ స్థాయి అభ్యర్థి అయితే కష్టం. అభ్యర్థి దాదాపు మున్సిపాలిటీ అంతా పరిచయమైన వ్యక్తిగా ఉంటేనే ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తారు. ఇక ప్రధాన పార్టీల విషయానికి వస్తే కూటమి ప్రభుత్వం పై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉన్నందున ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే ఖచ్చితంగా వైసిపి అభ్యర్థి విజయం తథ్యం అని కదిరి వైసిపి నాయకులు భావిస్తున్నారు. అందుకు స్థానికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఆ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

**2014 మునిసిపల్ ఎన్నికల్లో ఒక్కసారి మాత్రమే ఛైర్మన్ అభ్యర్థి టిడిపి తరఫున గెలవడం జరిగింది. మునిసిపాలిటీ ఆవిర్భావం నుండి అప్పటివరకు ఒక్కసారి మాత్రమే టిడిపి ఛైర్మన్ అయ్యారు. ఆ ఎన్నికల అప్పుడు వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు దాదాపు 15 స్థానాల్లో రెబల్ అభ్యర్థులుగా నిలవడంతో తెలుగుదేశం అభ్యర్థులు సునాయాసంగా గెలుపొందారు. దీనికంతటికి కారణం వైసిపి పార్టీ ఆవిర్భావం నుండి సమన్వయకర్తగా ఉన్న ఎస్ఎండి ఇస్మాయిల్‌ను కాదని చివరి నిమిషంలో మునిసిపల్ ఎన్నికలు జరుగుసమయంలో చాంద్ భాషను సమన్వ యకర్తగా నియమించడంతో ఇస్మాయిల్ అనుచరులకు కౌన్సిలర్ టికెట్లు దొరకక పోవడంతో వారు రెబెల్ అభ్యర్థులుగా బరిలో దిగడంతోనే తెలుగుదేశం విజయం సాధించింది. ఈ అంశం మీద స్థానిక వైసీపీ నాయకులు ఇస్మాయిల్ మీద అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. ఆ తరువాత 2021 మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి 30 స్థానాల్లో 61.17%ఓటు షేర్‌తో గెలుపొందగా టిడిపి కేవలం ఐదు స్థానాలతో 27.45%ఓటు షేర్‌తో సరిపెట్టుకుంది. ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా ఆ ఎన్నికల్లో గెలవడం జరిగింది. ఆ తర్వాత 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది.**

అలాగే స్థానిక శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఇటీవల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో కదిరి మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్మన్‌తో పాటు అన్ని వార్డుల్లో వందకు 100శాతం టిడిపి అభ్యర్థులు గెలిచేలా ప్రయత్నం చేస్తాం అని వారి కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపే కార్యక్రమం చేశారు.

అలాగే ఆయన ఆ సమావేశంలో మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి కదిరి మున్సిపాలిటీలు తెలుగుదేశం జెండా ఎగరవేస్తామని చెప్పడం స్థానికంగా చర్చనీయాంశం అయింది.

ఈ నేపథ్యంలో కదిరి శాసనసభ్యులు వెంకటప్రసాద్ వైసీపీ కౌన్సిలర్లను ఎన్నికల ముందు ఆ తర్వాత కొంతమందిని తెలుగుదేశం పార్టీలో చేర్చుకొని అప్పుడు ఉన్న వైసిపి మున్సిపల్ చైర్మన్ మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తెలుగుదేశం అభ్యర్థిని మున్సిపల్ చైర్మన్‌గా చేయడం జరిగింది, దీన్ని కూడా వెంకటప్రసాద్ తెలుగుదేశం విజయంగా భావించారు. నేరుగా మునిసిపల్ ప్రజలు తెలుగుదేశం పార్టీని కేవలం ఐదుగురు కౌన్సిలర్‌లకే పరిమితం చేసిన అప్రజాస్వామ్యంగా వైసిపి కౌన్సిలర్లను మభ్యపెట్టి ఈ విధంగా చైర్మన్‌ను చేసుకోవడంను ప్రజల హర్షించడం లేదు.

**మునిసిపల్ చైర్మన్ అభ్యర్థులు అందరూ ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వారే :**

కదిరి మున్సిపల్ చరిత్రలో ఒకసారి చూస్తే మునిసిపాలిటీ 1964 సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది. రెండు సంవత్సరాలు స్పెషల్ ఆఫీసర్ల పాలన తర్వాత కేవీ. నారాయణరెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా రెండు సంవత్సరాల పాటు కొనసాగారు.

ఆ తరువాత 1967 సంవత్సరం నుండి ఇప్పటి వరకు జరిగిన ప్రతి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థి చైర్మన్‌గా ఎంపిక కావడం జరుగుతున్నది ప్రధాన పార్టీలు కూడా ప్రతిసారి తమ చైర్మన్ అభ్యర్థిగా ముస్లిం మైనార్టీ అభ్యర్థిని ప్రకటించడం ఆనవాయితిగా జరుగుతున్నది. 2005 సంవత్సరంలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న సీనియర్ మంత్రి దివాకర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలకు ముందు పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రతిసారి ముస్లిం అభ్యర్థియే మున్సిపాలిటీలో చైర్మన్‌గా ఉన్నారు.

**2005లో జరిగిన మునిసిపల్ ఎన్నికలలో వార్డుల వారీగా ముస్లిం ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే మొత్తం 36 వార్డులలో 18 వార్డులలో ముస్లిం ఓటర్లు దాదాపు 45% నుండి 98% ఉన్నారు. కుటాగుల్లా రెండవ వార్డులో 45 శాతం ముస్లింలు ఉండగా అత్యధికంగా వలి సాబ్ రోడ్డులోని 25వ వార్డులో 98 శాతం ముస్లిం ఓటర్లు ఉండడం గమనార్హం. అదేవిధంగా అదేవిధంగా 20 నుండి 40 % ముస్లింలు ఉన్న వార్డులు మునిసిపాలిటీలో దాదాపు 9 వరకు ఉన్నాయి. ప్రతి మునిసిపల్ ఎన్నికల్లో ముస్లిం కౌన్సిలర్లు దాదాపు 20 మంది వరకు కౌన్సిల్లో ఉండేవారు. 2005 సంవత్సరంలో మున్సిపల్ ఓటర్లు 59103 కాగా ఇందులో ముస్లిం ఓటర్లు 27,487 ఉన్నారు. పట్టణంలో వైశ్య కులస్తులు దాదాపు 8 వేల వరకు ఉన్నారు రెడ్లు 6000 వరకు ఉన్నారు. క్రిస్టియన్స్ 3650 వరకు ఉన్నారు బలిజ కులస్తులు 1800 వరకు అలాగే దూదేకుల వారు 800 వరకు కంసలి కులస్తులు 2500 వరకు మాదిగ మాల కులస్తులు దాదాపు 5వేల వరకు ఎస్టీలు 1800 వరకు మునిసిపాలిటీలో ఓటర్లుగా ఉన్నారు. ఇక మిగిలిన ఓటర్లు వివిధ కులస్తులలో ఉన్నారు. కదిరి నియోజవర్గంలో శాసనసభ్యులుగా ముస్లింమేతరులు చాలామంది ఉన్నప్పటికీ మున్ని పాలిటీలు మాత్రం చైర్మన్లుగా ముస్లింలే ఉన్నారు. అనేది తేట తెల్లం గతంలో కదిరి నియోజవర్గంలో ముస్లింలు శాసనసభ్యులుగా మంత్రులుగా ఉన్నప్పటికీ మున్ని పాలిటీలో కూడా ముస్లింల చైర్మన్‌లుగా ఉన్నారు.**

హిందూ సోదరులు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ముస్లింలే మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కూడా ముస్లింలనే చైర్మన్ అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం ఉంది అలా కాకుండా ఒక ప్రధాన పార్టీ ముస్లింలు ప్రకటించి ఇంకొక ప్రధాన పార్టీ ఇతరులను ప్రకటిస్తే అది ఏ పార్టీ అయినా ముస్లిం అభ్యర్థిని ప్రకటించిన పార్టీనే కదిరి ముస్లింలు చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది. ఇకపోతే కదిరి మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున చైర్మన్ అభ్యర్థులుగా పార్టీ సీనియర్ నాయకురాలు పర్వీన్ భాను, బహుద్దీన్, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ పట్టణంలో ప్రముఖ వైద్యులు ఇస్మాయిల్ ఆజాద్, మాజీ కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ ఆచారి తదితరులు ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ బాబ్జాన్ ప్రస్తుత వైసిపి ఇన్చార్జ్ మక్బూల్ సమీప బంధువు పాండా రిజ్వాన్ కుటాగులకు చెందిన ప్రణీత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నూరుల్లా, సాదత్ అలీ ఖాన్ పరికి షామీర్ తదితరులు ఉన్నారు. ఇకపోతే వైసిపి ఆయుర్భావం నుండి వైసీపీలో ఉంటూ సమన్వ యకర్తగా పని చేసిన ప్రస్తుత వైసీపీలోని అత్యున్నత పదవి పీఏసీ సభ్యులు ఎస్.వీణ. ఇస్మాయిల్ అలాగే మాజీ శాసన సభ్యులు అత్తార్ చాంద్ బాషా తదితరులు చైర్మన్‌గా పోటీ చేస్తారో లేదో కాలమే నిర్ణయిస్తుంది.

**ఈసారి ముస్లింలను కాకుండా ముస్లిమేతర అభ్యర్థిని రంగంలో దించుతామని ప్రకటించి వెళ్లారు. ఆ తర్వాత కదిరి పట్టణంలో ముస్లింలలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాదాపు 45శాతం పైన ముస్లింలు ఉన్న మున్సిపాలిటీలో ముస్లిం అభ్యర్థి అయితేనే గెలవడానికి ఆస్కారం ఉంటుంది. అలా కాకుండా వేరే వారికి కేటాయిస్తే వాళ్లు చైర్మన్‌గా గెలవడం అసాధ్యమని తేల్చి చెప్పడంతో ఆ తరువాత ఈ విషయం అప్పటి ముఖ్య మంత్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి వెళ్ళింది. ఆయన ముస్లింలు అధికంగా ఉన్న కదిరిలో ముస్లింయే చైర్మన్‌గా ఉండాలని ఆదేశించడంతో అదే దివాకర్ రెడ్డి 15 రోజులు తర్వాత కదిరికి వచ్చి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా ముస్లిమే ఉంటారని ప్రకటించడం గమనార్హం.**

1964 నుంచి సంబంధిత సంస్థలో చైర్ పర్సన్‌లు, స్పెషల్ ఆఫీసర్లుగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు మొత్తం 30 మంది వివిధ హోదాల్లో సేవలందించి నట్లు అందుబాటులో ఉన్న అధికారిక జాబితా వెల్లడిస్తోంది.

**1964 అక్టోబర్ 1 నుంచి 1967 జూన్ 30 వరకు ఎస్. జగ్గా రెడ్డి కమిషనర్ అండ్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించగా, అనంతరం జె.ఆర్. రామ్ మోహన్ రావు, కె.వి. నారాయణ రెడ్డి, ఎన్.ఎం. నిజాం వలీ తదితరులు వరుసగా బాధ్యతలు చేపట్టారు.**

**1967 నుంచి 1974 మధ్య కాలంలో చైర్‌పర్సన్‌లు, కమిషనర్ అండ్ స్పెషల్ ఆఫీసర్లుగా పలువురు కొనసాగారు. 1980లలోనూ ఈ పరంపర కొనసాగింది.**

**సి. రసూల్, జొన్న వీరశేషయ్య, ఎన్.ఎం. నిజాం వలీ,ఎన్.వి. నాగరాజు గుప్తా, ఎన్.ఎం. ముజాఫర్ అలీ తదితరులు చైర్‌పర్సన్‌లుగా బాధ్యతలు నిర్వహించారు.**

**1995 నుంచి 2005 వరకు సి.ఏ. రసూల్, షహనాజ్ షకీర్ చైర్‌పర్సన్‌లుగా పనిచేశారు. అనంతరం వెమల ఫర్హానా ఫయాజ్, కె.వి. రామచంద్ర రెడ్డి తదితరులు బాధ్యతలు చేపట్టారు.**

**2010 నుంచి కొంతకాలం వరుసగా స్పెషల్ ఆఫీసర్లుగా టి.రంగయ్య, ఎం.వి.సుబ్బారెడ్డి, పి.ప్రశాంతి, కె.ఎస్. రామారావు, డి. మధుసూదన్ రావు తదితరులు కొనసాగారు.**

**2014లో షేక్ సురయ్య బాను చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టగా, అనంతరం ఎం. రామసుబ్బయ్య స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు.**

**2020 సెప్టెంబర్ నుంచి 2021 మార్చి వరకు కె. వెంకటరెడ్డి స్పెషల్ ఆఫీసర్‌గా, 2021 మార్చి నుంచి 2025 వరకు పి. నజీమున్నిసా చైర్‌పర్సన్‌గా పని చేసినట్లు జాబితాలో ఉంది.**

**2025 నుంచి 2026 వరకు కె.ఎస్. దిల్షాదు న్నిసా చైర్‌పర్సన్‌గా కొనసాగగా, 2026 మార్చి నుంచి మే వరకు వీవీఎస్ శర్మ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వ హించారు.**

**2026 జూన్ నుంచి ప్రస్తుతం మౌర్య భర ద్వాజ్ స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.**

దీంతో 1964 నుంచి 2026 వరకు సంబంధిత సంస్థకు చైర్‌పర్సన్‌లు, స్పెషల్ ఆఫీసర్లుగా పనిచేసిన వారి పరంపర దాదాపు ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్నట్లు ఈ రికార్డు ద్వారా తెలుస్తోంది.

# తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మరణించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల సాయం**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యారు.ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మి రెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల





**డోన్ – సూర్య వాస్తవం :** డోన్ మండలం గుండాల గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో దేవాలయాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కృషి చేయాలని సూచించారు.శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆశీస్సులతో గ్రామం సుఖశాంతులు, సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకమండలి సభ్యులు సేవాభావంతో పని చేసి ఆలయ ప్రతిష్ఠను మరింత పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్పీ సారు.. మీరే న్యాయం చేయాలి...!

- స్థలం ఆక్రమించుకొని మమ్మల్నే బెదిరిస్తున్నారు
- పోలీస్ డిపార్ట్‌మెంట్ పేరుతో బెదిరిస్తున్నారని బాధితురాలి ఆరోపణ



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** తమ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు పోలీస్ డిపార్ట్‌మెంట్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గొల్ల శిరీష జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనంతపురం నగరంలోని అరవింద్ నగర్, మిస్సమ్మ స్థలం పక్కన ఉన్న ఇంటి నంబర్ 11/390లో గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని తెలిపారు. ఆరు నెలల క్రితం తమ పక్కింటిని అనంతమ్మ అనే మహిళ కొనుగోలు చేసి, ప్రస్తుతం ఇల్లు నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఈ విషయంపై ప్రశ్నిస్తే పోలీస్ డిపార్ట్‌మెంట్ పేరుతో కొందరిని పిలిపించి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. అంతేకాకుండా తరచూ గొడవలకు దిగుతూ దూషిస్తున్నారని, పదేపదే ఫిర్యాదులు చేస్తూ పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నారని పేర్కొన్నారు. తాము ఎలాంటి తప్పు చేయకపోయినా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, స్థల వివాదాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.







# డీఈఓ సారు.. ట్రెల్లిస్‌పై మౌనమెందుకు..?

- అధికారుల నిర్లక్ష్యంపై బాధితుల ఆందోళన
- ఎంపీ, కలెక్టర్ ఆదేశాలున్నా న్యాయం జరగలేదని ఆరోపణ
- డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా.. స్పందించని డీఈవో
- అధికారులు బాధితుల వైపా..? కార్పొరేట్ స్కూల్ వైపా..?
- డీఈవో తీరుపై సర్వత్రా విమర్శలు
- పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన బాధితులు
- ట్రెల్లిస్ స్కూల్ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** ట్రెల్లిస్ స్కూల్ వ్యవహారంలో బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఇప్పటికే ఎంపీ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అధికారుల స్థాయిలో ఆదేశాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని వారు పేర్కొన్నారు. గత 20 రోజులుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. గతంలో జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన విచారణకు హాజరై తమ వాదనలను అధికారులకు వివరించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని వాపోయారు.

**డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన**

సమస్య పరిష్కారం కోసం బాధితులు, ప్రజాసంఘాల ప్రతినిధులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.



బాధితుల సమస్యపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

ట్రెల్లిస్ స్కూల్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

# డీఎస్సీపై దమ్ముంటే అసెంబ్లీకి రండి..

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించే అవకాశం ఉండగా, భౌతిక దాడులకు దిగడం రౌడీయిజానికి నిదర్శనమని మండిపడ్డారు.

**గురువులపై దాడులు బరితెగింపే**

ఉపాధ్యాయులపై దాడులు చేయడం దారుణమని, ఇది వారి బరితెగింపు చర్యలకు నిదర్శనమని చంద్రబాబు అన్నారు. "డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు తమవి కష్టార్జితమని చెబుతున్నారు. క్రీడల్లో పతకాలు సాధించి, నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు పొందారు. అలాంటి వారిని ఫేక్ అనడం, వారిపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసం? మీడియా ముసుగులో కుప్పంలో ఓ వైసీపీ అనుకూల రిపోర్టర్ ఆర్మీలో పనిచేసి వచ్చిన ఉపాధ్యాయుడిపైనే దాడికి పాల్పడ్డాడు. ఇది వారి అరాచక మనస్తత్వానికి అద్దం పడుతోంది. తమను ఫేక్ అని అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రౌడీలతో దాడులు చేయిస్తారా? గురువులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

**పారదర్శక నియామకాలే మా ట్రాక్ రికార్డ్**

తమ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "నా పాలనలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించాం. ఎక్కడా అవినీతికి, లీకేజీలకు తావులేకుండా పూర్తిచేశాం. మెగా డీఎస్సీ – 2025ను అడ్డుకోవడానికి ఏకంగా 355 పిటిషన్లు వేసినా, వాటన్నింటినీ అధిగమించి చట్టబద్ధంగా నియామకాలు చేపట్టాం. ఏడాది తర్వాత ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు" అని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందిన వారికి గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగానే నియామకాలు జరిగాయని గుర్తుచేశారు.

"సర్టిఫికెట్లు ఇచ్చింది మీరు.. వాటి ఆధారంగా ఉద్యోగాలు పొందితే ఫేక్ అంటారా? కుక్క తోక వంకర అన్నట్టుగా ఉంది వీరి వ్యవహారం" అని ఎద్దేవా చేశారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఆరోపణలపై ఉపాధ్యాయులే స్వయంగా కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, తమ ఉద్యోగాలు కష్టార్జితమని నినదించారని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఇద్దరు మహిళా అధికారులు కూడా వాస్తవాలను వివరించారని, అయినా వైసీపీ నేతలు పెడ చెవిన పెడుతున్నారని అన్నారు. "ఆరోపణలు చేసే వారికి దమ్ముంటే అసెంబ్లీకి రండి. సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పి, వారి అబద్ధాలు తేలుస్తాం" అని సవాల్ విసిరారు.

**రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం**

2019–24 మధ్య రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిందని, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నేతల హింసాత్మక ధోరణి మారలేదని చంద్రబాబు విమర్శించారు. "కుప్పంలో నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలిచ్చి రక్తాభిషేకాలు చేసే సంస్కృతి వారిది. రాజకీయ ముసుగులో ఇలాంటి రౌడీయిజాన్ని ఉపేక్షించం. వారి తోకలు కత్తిరిస్తాం. ఈ ప్రక్రియ కుప్పం నుంచే మొదలవ్వాలి" అని హెచ్చరించారు. అమరావతిని శ్మశానం అన్నవారు, నేడు అది అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## హుస్సేనాపురం పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు

**ప్యాపిలి– సూర్య వాస్తవం**

స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నాడు ప్రముఖ నవయుగ వైతాళికుడు మహాకవి గురజాడ వెంకట అప్పారావు గారి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ఎం చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు గురజాడ అప్పారావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి తన ప్రసంగంలో మాట్లాడుతూ తెలుగు ఆధునిక సాహిత్యానికి గురజాడ అప్పారావు వేసిన పునాదులను, ఆయన చేసిన దిశానిర్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. నాటి సమాజంలో వేళ్లూనుకుపోయిన దురాచారాలపై ఆయన సంధించిన అస్త్రం కన్యాశుల్కం నాటకమని సమాజ మార్పు కోసం ఆధునిక సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుందని వారు స్పష్టం చేశారు.గురజాడ ఆశయాలను ఉన్నతమైన ఆలోచనలను విద్యార్థులు తమ జీవితంలో అలవర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. అలాగే తెలుగు ఉపాధ్యాయులు సర్వజ్ఞమూర్తి సంధ్యారాణి గార్లు ముఖ్య ప్రసంగం చేస్తూ తెలుగు భాషా వికాసానికి



గురజాడ చేసిన కృషిని కొనియాడారు. "దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్" అంటూ ఆయన రాసిన గేయం సమాజంలో ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సచివాలయ సిబ్బంది మహిళా పోలీస్ ఇంద్రావతమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ అనేది అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఉత్తమ ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఫాజిదా బేగం కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రాఘవేణి జె. దివాకర్ ఎం. కంబగిరి, రుక్సానా ఖాటూన్, జయలక్ష్మి, శ్రీకాంత్, గోపాల్, మోహన్ రెడ్డి, పుల్లయ్య, బోరెడ్డి, శ్రావణి, రాజశేఖర్, మురళి, విజయలక్ష్మి మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## వీరభద్రస్వామి సన్నిధిలో శుద్ధ జల నీటి పథకం ప్రారంభం





**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని తంబళ్లపల్లి పొలిమేర ప్రాంతం, పెద్దవడుగూరు గ్రామానికి సమీపంలో గల భద్రకాళి వీరభద్రస్వామి (గుడ్ల వీరన్న) దేవాలయ ఆవరణంలో సోమవారం 5 లక్షల 50 వేలు రూపాయలతో శుద్ధ జల పథకాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ కమిటీ మరియు వీరభద్రస్వామి భక్తుల ఆధ్వర్యంలో అపర భగీరధులైన దేవన వేణుగోపాల్ రెడ్డి దేవన వెంకటశేషానందరెడ్డి, దేవన మురళీధరరెడ్డి, గుత్తి అనంతపురం మాజీ సర్పంచ్ దేవన తానేశ్వరరెడ్డి, కదిరి చంద్రశేఖరరెడ్డి, బాలవికాస్,బాల మోహనరెడ్డి వీరందరి సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు, అపర భగీరథ దాతలను వీరభద్రస్వామి ఆలయ కమిటీ మరియు వీరభద్రస్వామి భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. వారికి వారి కుటుంబ సభ్యులకు వీరభద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వీరభద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు వీరభద్ర స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఒక ఆశ వర్కర్ పోస్ట్‌కు 24వ తేదీ లోపల దరఖాస్తు చేసుకొవాలి

**పామిడి - సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల సచివాలయం పరిధిలో ఒక ఆశా వర్కర్ పోస్టు ఖాళీగా ఉన్నందని,జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఆప్రాంత నివాసితులై, అర్హులైన అభ్యర్థులందరూ ఆశావర్కర్ గా విధులు నిర్వహించుటకు దరఖాస్తు చేసుకోవచ్చని,అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో, సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి, 24వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తును పి హెచ్ సి ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్ సి)లో వైద్యాధికారి వి.సుధాకర్ కు సమర్పించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## గుత్తిలో సామూహిక దీక్షలలో పాల్గొన్నా సీపీఐ,సీపీఎం అఖిల భారత రైతు కూలీ సంగం



**గుత్తి -సూర్య వాస్తవం :** గుత్తి ఎమ్మార్వో కార్యాలయం ఎదు ట సీపీఐ,సీపీఎం అఖిల భారత రైతు కూలీ సంగం,ఆధ్వర్యంలో సా మూహిక దీక్షల కార్యక్రమం నిర్వ హించడం, జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ,అనంత పురం జిల్లాను జాతీయ విపత్తు జి ల్లాగా వెంటనే ప్రకటిశీచాలని,రైతు లు,వ్యవసాయ కూలీలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలని డిమాండ్ చే శారు.రైతులు,కూలీల సమస్య లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి,వారి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.ప్రజలు,రైతులు,వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో కూడా పోరాటాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ,సీపీఎం నాయకులు,అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు,కార్యకర్త లు,రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో,సీపీఐ,మండల కార్యదర్శి,రామదాసు, సీపీఎం, మండలకార్యదర్శి,నిర్మల,ఐద్వా,మండలకార్యదర్శి,రేణుకా,రైతు,సంఘం, నియోజకవర్గ, అధ్యక్షులు, వెంకటరాముడు, పట్టణకార్యదర్శి, రాజుయాదవ్, సహాయకార్యదర్శి, నజీర్, కులసంగం, నాయకులు,మల్లి కార్జున, సీపీఐ, మండల సహాయ కా ర్యదర్శి, నరసింహయ్య, సీనియర్ నాయకులు,బి,రామకృష్ణ,వ్యవసాయ కార్మిక సంఘూశీ,మండల కార్యద ర్శి,మల్లేష్,మండల సహాయ కార్య దర్శి రామాంజనేయులు,ధనుంజ య,నజీర్,సీనియర్ నాయకులు,ష ఫీ,టియం,బాషా,బెస్త శివకు మార్, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో వీఆర్‌ఎలు ధ్యా నం చేస్తూ వినూత్న నిరసన

**గుత్తి -సూర్య వాస్తవం :** గుత్తి మండలం ఎమ్మార్వో కార్యాల యం నందు తమ డిమాండ్ల సాధన కోసం వీఆర్వీలు సమ్మె చేస్తున్న విష యం తెలిసిందే.సోమవారం కూడా సమ్మె కొనసాగించారు.ధ్యానంచేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.వీఆర్ఎల అసోసియేషన్ అ ధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సీనియర్ వీఆర్ఎలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని,వీఆ ర్ఎ మృతి చెందితే కుటుంబంలో ఒ కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా వీఆర్ఎల అసోసియేషన్ అధ్యక్షు డు ఎన్.సుధాకర్,ఉపాధ్యక్షుడు పె ద్దన్న, కోశాధికారి రాంప్రసాద్,వినోద్, సలహాదారుల కమిటీ సభ్యులు నా రాయణస్వామి, చిరంజీవి, సరస్వతి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు సుధాక ర్,జగదీష్,యుగంధర్ పాటు వీఆర్ ఎలు పాల్గొన్నారు.



# వెనుకబడిన రాయలసీమ కాదు...

# రైజింగ్ రాయలసీమ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!

**-అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులను అవమానించిన వైసీపీ - ఇప్పుడు విమర్శిస్తున్నారని ఆగ్రహం**
**- హంద్రీనీవా విస్తరణతో రాయలసీమకు మరింత నీటి వసతి - రెండేళ్లలో 752 మందికి రూ.7.40 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం: ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రాయలసీమ వెనుకబడిన ప్రాంతం కాదని, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న రైజింగ్ రాయలసీమ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 36వ విడతలో భాగంగా 39 మంది లబ్ధిదారులకు రూ. 27.75 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండేళ్లలో 752 మందికి రూ. 7.40 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం రూ. 85 లక్షల మేర మాత్రమే సీఎంఆర్ఎఫ్ సాయం అందించారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని దగ్గుపాటి విమర్శించారు.



ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. విద్యా రంగంలో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అనేక మార్పులు తీసుకొచ్చారని,



మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులను అవమానించిన వారు.. ఇప్పుడు ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రూ. 3,500 కోట్లతో హంద్రీనీవా కాలువను విస్తరించి, కుప్పం నుంచి మడకశిర వరకు నీటి వసతి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పెట్టుబడులను తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనూ గత రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా...!

**- విద్యార్థులు, నిరుద్యోగుల గొంతును అణచివేయడం సరికాదు మంజునాథ్ రెడ్డి**

**ఉరవకొండ - సూర్య వాస్తవం :** మెగా డీఎస్సీ నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని శాప్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ విద్యార్థి విభాగం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయని ఆ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి ఆరోపిస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడటం దుర దృష్టకరమన్నారు. డీఎస్సీ నియామకాలపై విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తుంటే వారిని భయపెట్టే ప్రయత్నాలు చేయడం సరికాదని మంజునాథ్ రెడ్డి అన్నారు. విద్యార్థి నాయకులపై జరిగిన దాడి వెనుక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం, ఆదేశాలు ఉన్నాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల స్పందన తెలియాల్సి ఉంది. శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు



చేపట్టి, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో వచ్చిన ఆరోపణలు, ధ్రువపత్రాల ప్రామాణికత, అర్హతలు, మెరిట్ ప్రక్రియ తదితర అంశాలపై పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. విచారణలో ఎవరైనా అనర్హులు లేదా తప్పుడు ధ్రువపత్రాలతో ఎంపికైనట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని కూడా వైఎస్సార్ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే హక్కును కాపాడాలని, డీఎస్సీ నియామకాలపై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, చంద్రశేఖర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను జాతీయ కరువు విపత్తుగా ప్రకటించాలి

**- రైతాంగాన్ని, ప్రజలను కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని.(వామపక్షాల డిమాండ్)**

**పామిడి- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లాను జాతీయ కరువువిపత్తు జిల్లాగా ప్రకటించి, కరువు పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా రైతాంగాన్ని, ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని మండల వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూయి. సోమవారం ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్లో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సామూహిక నిరు వదిక రిలేదీక్షలు ప్రారంభించారు. 21,22,23 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లుగా వావక్ష పార్టీలైన సీపీఐ, సిపిఎం,సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తదితర అఖిలపక్ష పార్టీలు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనిరువధిక రిలేదీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా తగిన వర్షాలు లేకపోవడంతో రైతులు, ప్రజలు, వ్యాపారస్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో అనంతపురంజిల్లా కరువు పరిస్థితులతో తీవ్ర స్థాయిలో కొట్టు మిట్టలాడుతుందని,



పంటలు సాగు చేసిన రైతులు, వర్షం లేక ఎంపిఆర్ డ్యాం నీరు అందక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కరువు ప్రభావంతో వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమైందని, పంట పొలాలు ఎండిపోవడమే గాక రైతులకు సాగునీరు, తాగునీరు, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం వంటి సమస్యలు తీవ్ర దుర్భర స్థితికి చేరుకున్నట్లు వారు పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి,అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కరువు కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పంట నష్టపరిహారం, రుణ ఉపశమనం, సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వాలు చర్యలు తీసుకోని ఎడల నిరాహార దీక్షలు ధర్నాలు ర్యాలీలు రాస్తారోకోలు లాంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 21న వామపక్షాల ఆధ్వర్యంలో కోదండరామిరెడ్డి, రామచంద్ర, హరి కుమార్, రామాంజనేయులు, నూర్ భాషా, ఓబయ్య, తదితరులు నిరవధిక రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు రహీం, అనిమిరెడ్డి, ముత్యాలు,చౌడప్ప, ఓంకార్, సూర్యనారాయణరెడ్డి, రాముడు, ఇమాము, ప్రకాష్ గౌడ్, ప్రసాద్ శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అభ్యుదయ పితామహుడు గుర జాడ అప్పారావు164వ జయంతి వేడుకలు




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో సోమవారం ఉదయం రాష్ట్ర ప్రభు త్వ పెన్షనర్ల భవనం లో ప్రెసిడెంట్ అ బూబకర్,కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో గురజాడఅప్పారావు 164వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కోశాధికారి జెన్నేకు ల్లాయిబాబు గురజాడ అప్పారావు చిత్ర పటానికి పులా మాల వేసిని వాళులర్పించారు.జాయింట్ సెక్రటరీ లక్ష్మీ నారాయణరెడ్డి మాట్లాడుతూ... వీరు అనకాపల్లి రాయవరం గ్రామం లో జన్మించారు.వీరికి గురజాడ అని అంటారు. వీరి వృత్తి రచయిత, సంఘ సంస్కర్త, సాహితీ కారుడు,హే తువాది, అభ్యుదయ వాది అతను ప్రజలకు అర్థమయ్యేవాడుక భాషలో రచనలు చేశారు. వీరి కన్యాశు ల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది.వీరి ఉద్యోగము రచయిత, కవి, అప్పట్లో వీరి జీతం కేవలము రూ.500లు మాత్రమే.వీరి పదవి పేరు తెలుగు భాషా మహాకవి అని కోశాధికారి జె న్నే కుల్లాయిబాబు తెలిపారు.ఈ కా ర్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ రెడ్డి, నారాయణ శెట్టి, నారాయణ రెడ్డి, దేవదాస్, వేణుగోపాల్, ఓబులేసు తది తరులు పాల్గొన్నారు.

## మైసూరు దత్త పీఠంలో దత్త భజన మండలి వారిచే కీర్తనలు



**పామిడి - సూర్య వాస్తవం :** మైసూరు అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం అనంతపురం జిల్లా పామిడి దత్తపాదక క్షేత్రం భక్తాదులు ఘనంగా భజన కార్యక్రమాలు ఘనంగా జరిగింది. మైసూరులోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమంలో చిన్నారులు, భక్తులు భక్తి గీతాలు ఆలపించారు. రాగరాగిణి విద్య ద్వారా సంగీత చికిత్స (నాద చికిత్స) ను ప్రపంచానికి పరిచయం చేసిన స్వామీజీ, భక్తులను ఆశీర్వదించారు. 1942 మే 26న జన్మించిన స్వామీజీ 1966లో మైసూరు చాముండి కొండ పాదాల వద్ద 40 ఎకరాల్లో దత్త పీఠాన్ని స్థాపించారు. స్వామీజీ భక్తి, యోగా, సంగీతం ద్వారా ఆధ్యాత్మిక సేవ చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా 78 ఆశ్రమ శాఖలు, శునకవన పక్షుల పునరావాస కేంద్రం, బోన్సాయ్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌తో మహిళలు, చిన్నారులకు కొండంత భరోసా...!

- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- మహిళలు, చిన్నారుల భద్రతకు ఎల్లప్పుడూ అండగా జిల్లా పోలీసు శాఖ



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 'శక్తి యాప్'పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. మహిళా పోలీసులు, శక్తి టీమ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మహిళలు, విద్యార్థినులకు యాప్ ఉపయోగం, అత్యవసర సమయాల్లో దాని ద్వారా పోలీసులను సంప్రదించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినుల మొబైళ్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, ఆపద సమయంలో ఎలా వినియోగించాలో ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. వేధింపులు, ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని సూచిస్తున్నారు. అదేవిధంగా సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని మహిళలు, బాలికలకు సూచి స్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రతకు శక్తి యాప్‌ను ఉపయోగించు కోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అనంతపురం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు తెలిపారు.



# నేరస్థలంలోనే శాస్త్రీయ ఆధారాల సేకరణకు మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్

- శాస్త్రీయ ఆధారాలతో నేర పరిశోధనను మరింత పటిష్టం చేయాలని సూచన
- ఆధారాల ప్యాకింగ్, లేబులింగ్, సీలింగ్‌లో నిబంధనలు పాటించాలి:.ఎస్పీ పి జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల సేకరణను మరింత పటిష్టం చేసేందుకు అనంతపురం జిల్లాకు నూతన మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ (ఎంఎఫ్‌యూ) వాహనం కేటాయించారు. ఈ వాహనాన్ని జిల్లా ఎస్పీ పి. జగదీష్, డీపీఓ ఆవరణలో పరిశీలించారు.ఈ సందర్భంగా వాహనంలో అందుబాటులో ఉన్న ఫోరెన్సిక్ పరికరాలు, వాటి వినియోగం, నేరస్థలాల్లో శాస్త్రీయ ఆధారాల సేకరణ విధానాలపై సంబంధిత అధికారులతో ఎస్పీ చర్చించారు. నేరం జరిగిన ప్రదేశానికే మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ చేరుకుని ఆధారాలను గుర్తించడం, ఫొటోగ్రఫీ, వీడియో డాక్యుమెంటేషన్‌తో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాలను సేకరించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు.వేలిముద్రలు, రక్తపు మరకలు, జీవ సంబంధిత ఆధారాలు, వెంట్రుకలు, ఫైబర్లు, ఇతర భౌతిక ఆధారాలను శాస్త్రీయంగా సేకరించడంలో ఎంఎఫ్‌యూ కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**ఆధారాల భద్రతకు ప్రాధాన్యత**

నేరస్థలాల్లో సేకరించిన ఆధారాలను నిబంధనల ప్రకారం ప్యాకింగ్, లేబులింగ్, సీలింగ్, భద్రపరిచే ప్రక్రియలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఆధారాల చైన్ ఆఫ్ కస్టడీలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నేరస్థలంలో లభించే ప్రతి ఆధారాన్ని కీలకంగా పరిగణించి, నిర్దేశిత ఫోరెన్సిక్ విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ శాస్త్రీయ ఆధారాలతో నేర పరిశోధనను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ పేర్కొన్నారు.

## ఉద్యోగాలు పొందడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- ఐటీఐ విద్యార్థులకు... ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు...!
- ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచన





**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** విద్యార్థులు ఉద్యోగాలు పొందడమే లక్ష్యంగా కాకుండా, భవిష్యత్తులో పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నైపుణ్య శిక్షణ పొందిన యువతకు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలు కీలకంగా దోహద పడతాయని తెలిపారు.అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్ఏఎం) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదువుకోవడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఐటీఐలో అందిస్తున్న సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను అంది పుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి అవకాశాల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ, అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలను యువత పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని కోరారు.పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందడం ద్వారా వాస్తవ పని విధానంపై అవగాహనతో పాటు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పీఎంఎన్ఏఎం ద్వారా పరిశ్రమలు, అర్హత కలిగిన యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఐటీఐ అధికారులు, సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ పీజీఆర్ఎస్‌లో 129 అర్జీలు

- ఫిర్యాదులను సమగ్రంగా విచారించి వేగంగా పరిష్కరించాలి
- పిటిషనర్లు, సహాయకులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఉచిత భోజనం
- ప్రజాసమస్యల పరిష్కారమే పోలీసుల కర్తవ్యం ఎస్పీ పి. జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 129 అర్జీలు స్వీకరించారు.పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా విచారించి, బాధితులకు వేగంగా, పారదర్శకంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. కుటుంబ తగాదాలు తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ కూడా ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు విచ్చేసిన పిటిషనర్లు, వారి సహాయకులకు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భోజనం అందించారు. "ప్రజల సమస్యలకు స్పంది ంచడం.. పరిష్కారం చూపడమే మా బాధ్యత" అని పోలీసు అధికారులు తెలిపారు.

## క్యాప్కో చైర్మన్ జి.సురేష్ కుమార్‌కు అభినందనలు తెలిపిన కమిషనర్ కే.కన్నబాబు...!

- పుట్టపర్తి వేదికగా జరిగిన 16వ జాతీయ సదస్సు విజయవంతంపై ప్రశంసలు
- జి.సురేష్ కుమార్‌ను శాలువతో సత్కరించిన కమిషనర్
- ప్రభుత్వ శాఖలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు





**విజయవాడ - సూర్య వాస్తవం :** సత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంగా నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సు విజయవంతంగా నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ అండ్ కన్స్యూమర్ అఫైర్స్ కమిషనర్ కే. కన్నబాబు, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) చైర్మన్ జి. సురేష్ కుమార్‌ను అభినందించారు.

సోమవారం విజయవాడలోని సివిల్ సప్లైస్ రాష్ట్ర కార్యాలయంలో సురేష్ కుమార్‌తో పాటు శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కమిషనర్ కే. కన్నబాబు, సివిల్ సప్లైస్ డైరెక్టర్ శ్రీవాస్ నూపూర్ అజయ్ కుమార్‌ను కలిసి సదస్సు విజయవంతానికి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు, వినియోగదారుల అవగాహన అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ వినియోగదారుల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి త్వరలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు**

పుట్టపర్తి కేంద్రంగా ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సును కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ (క్యాప్కో), కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ ( సిసిసి), న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహించాయి. ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ శాఖ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ( బిఐఎస్ ) సహకారంతో జరిగిన ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటిసారిగా ఇంత విస్తృత స్థాయిలో జాతీయ వినియోగదారుల సదస్సు నిర్వహించడం వినియోగదారుల ఉద్యమంలో ముఖ్యమైన కార్యక్రమంగా నిలిచిందని క్యాప్కో ప్రతినిధులు తెలిపారు. సదస్సు విజయవంతానికి సహకరించిన ప్రభుత్వ శాఖలు, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులకు క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం కమిషనర్ కే.కన్నబాబు, క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధి మాలపాక భాస్కర్, ధర్మవరం వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిన్నతిమి చిన్నప్ప, శ్రీ సత్యసాయి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పళ్లెం జనార్ధన్, కొత్తచెరువు వినియోగదారుల సంఘం అధ్యక్షులు కేశవ తదితరులు పాల్గొన్నారు.

## కోనాపురంలో ఆశా కార్యకర్త పోస్టు ఖాళీ...

- అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి...

**బెళుగుప్ప - సూర్య వాస్తవం :** బెళుగుప్ప మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కమ్యూనిటీ ప్రాసెస్ కింద జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా ఆశా కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వైద్యాధికారిణి డా. టీ. ప్రియాంక తెలిపారు. బెళుగుప్ప మండలంలోని శీర్పి సచివాలయం పరిధిలోని కోనాపురం గ్రామంలో ఒక ఆశా కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఈ పోస్టుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబర్ 21 నుంచి 24వ తేదీ వరకు బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమర్పించాలని సూచించారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేయాలని డా. ప్రియాంక తెలిపారు. అర్హతలు, ఇతర వివరాల కోసం బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

## ఆరోగ్యశాఖకు చెందిన అన్ని విభాగాల హెచ్ఓడిఎస్‌తో సమీక్ష

**- సమావేశం నిర్వహించిన మంత్రి సత్య కుమార్**






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** మంగళగిరిలోని ఆఫీస్ భవనంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన ఆరోగ్య శాఖకు చెందిన అన్ని విభాగాల హెచ్ఓడీస్‌తో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో బయోఎకానమీ పవరహౌజ్ పాలసీ 2026--35ను ప్రధానంగా చర్చిస్తూ,ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ బయోమాన్న ఫాక్చరింగ్ కాపిటల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టనున్న ఆరు కీలక మిషన్లపై సమీక్షించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ పరిధిలోని జనస్వర్ణ, బయోబాంక్, ఒన్ హెల్త్ గ్రిడ్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, 2035 నాటికి రూ 2 లక్షల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులు, 28 లక్షల ఉపాధి అవకాశాల లక్ష్యాలపై చర్చించారు. అలాగే 2026--31 కాపిటల్ హెల్త్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ లో రూ 13,881 కోట్ల పెట్టుబడి ప్రణాళిక,ఆసుపత్రులు,ట్రామా సెంటర్లు, మాతా-శిశు ఆరోగ్య విభాగాలు, డయాగ్నస్టిక్ హబ్‌లు,వైద్య పరికరాల బలోపేతం,ఏపీ-ఫడా పాలసీ ద్వారా ఆహార భద్రత--ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్ఠం చేయడం, అనధికార గైర్హాజరు శాఖల సూచనలపై కాలపరిమితితో కూడిన పర్యవేక్షణ వంటి అంశాలపై కూడా సమీక్షించారు. ఆధునిక సాంకేతికత,పెట్టుబడులు, మౌలిక వసతులు, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనతో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

## తిరుపతి జిల్లా కాంగ్రెస్‌లో నూతన నియామకాలు






**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురువం బాబుచేతుల మీదుగా ఆమూరి కృష్ణమూర్తి, తిరుపతి వైస్ ప్రెసిడెంట్‌గా, గొడుగుచింత గోపి తిరుపతి జిల్లా కార్యదర్శిగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులకు స్వాగతం పలికారు. పార్టీ దిశా నిర్దేశాలు,భవిష్యత్ కార్యాచరణపై వారికి సూచనలు చేశారు. అంతేకాకుండా "రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా "రాహుల్ గాంధీ" నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయ డంక మోగించడం ఖాయం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో "వై. ఎస్. షర్మిలమ్మ"నాయకత్వంలో,తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నామని, ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి, రాబోయే ఎన్నికల్లోనే ప్రత్యర్థులకు సమాధానం చెప్పాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** కర్నూలు బి.క్యాంప్‌లోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ప్రముఖ తెలుగు కవి, రచయిత, నాటకకర్త, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ఎస్ఎస్ పి.ఓ.డా. ఎస్.నాగస్వామి నాయక్ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం గురజాడ అప్పారావు జీవిత విశేషాలు,తెలుగు సాహిత్యానికి ఆయన అందించిన సేవలు,సమాజ సంస్కరణ కోసం చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు. గురజాడ అప్పారావు రచించిన "కన్యాశుల్కం"తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని కలిగించిన గొప్ప రచనగా నిలిచిందని తెలిపారు. బాల్యవివాహాలు,కన్యాశుల్కం, మూఢనమ్మకాలు,సామాజిక అసమానతలు వంటి సమస్యలను తన రచనల ద్వారా ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్,దేశమంటే మనుషులోయ్"అనే గురజాడ అప్పారావు సందేశం ప్రతి ఒక్కరిలో దేశభక్తి, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గురజాడ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహి త్యానికి మార్గ దర్శకుడిగా నిలిచారని, ఆయన రచనలు నేటికీ సమాజానికి ఉపయోగకరమైన సందేశాలను అందిస్తున్నాయని స్టాఫ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున,విజయశేఖర్, రామకృష్ణ,సోమేష్ తదితర స్టాఫ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొని గురజాడ అప్పారావుకు ఘన నివాళులు అర్పించారు.

## వేణుంభాకంలో పడకేసిన పారిశుధ్యం

- దళితవాడలో గిరిజన కాలనీలో ఎక్కడ చూసిన వీధుల్లో మురికి నీరు చెత్తకుప్పలు
- రాత్రి అయితే దోమలతో బెడద... వ్యాధుల బారిన పడుతున్న గ్రామస్తులు
- కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలు కూడా లేదంటున్న గ్రామస్తులు
- కనీసం వీధుల్లో క్లోరినేషన్ చేయండి అంటున్న గ్రామస్తులు





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణ భారత్, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే ఇలాంటి కార్యక్రమాలను అమలు చేసి ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలని తెలుపుతూ ఉంటే. కొన్ని గ్రామాలు పారిశుద్ధం పేరుకు పోయి వీధుల్లో ఎక్కడపడితే అక్కడ బురద నీరు చెత్తకుప్పలు తో నిండిపోయి పారిశుధ్యం పడకేసి ఉంది, దీనివలన గ్రామాలలో సీజన్ వ్యాధులతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు,వివరాల మేరకు తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం వేణుంభాకం గ్రామంలో చోటు చేసుకునే ఉంది. వేణుంభాకం దళితవాడ, గిరిజన కాలనీలో వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేడ దిబ్బలు విలువ చేరిన వర్షపు నీరు జలదరిగుంట వద్ద బురద నీరు దర్శనమిస్తూ ఉన్నాయి. అంతేకాకుండా గ్రామస్తులు చెత్తాచెదారం మొత్తం హరిజనవాడ సమీపాన కుప్పలు కుప్పలుగా వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధపు వాసనతో వెదజల్లుతూ ఉన్నాయి. రాత్రి అయితే ఆ చెత్త కుప్పల ప్రాంతం నుంచి దోమలు దళితవాడపై గిరిజన కాలనీలపై దండయాత్ర చేయ డంతో కాలనీ వాసులందరూ సీజన్ వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ ప్రాంతాలలో కనీసం సంబంధిత అధికారులు బ్లీచింగ్ చేసిన దాఖలు కూడా లేవు అంటున్న గ్రామస్తులు. ఈ ప్రాంతంలో కనీసం ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే డ్రైడే అలాంటి కార్యక్రమాలు కూడా జరిగిన దాఖలు లేవు. వేణుంభాకం ఊరికి చెందిన వారందరూ చెత్త కుప్పలు చెత్త చెదారం అంతా వీధుల్లోనే కుప్పలు కుప్పలుగా వేయడంతో వాటి ద్వారా వెలువడి దోమలు ఈగల వల్ల గ్రామస్తులందరూ సీజన్ వ్యాధులతో బాధపడుతూ ఉన్నారు. అదే గ్రామంలో అదే వీధిలో సచివాలయం ఉంది అక్కడే చెత్త కుప్పలు కుప్పలుగా వేస్తూ ఉంటారు అయినా గాని పట్టించుకున్న దాఖలు లేవు. ఎన్ని సార్లు చెప్పిన చెప్పిన సమయంలో తూ తూ మంత్రంగా పరిశుభ్రం చేస్తారు మరల రెండో రోజు నుంచే చెత్తకుప్పలు వేస్తారు సంబంధిత అధికారులు స్పందించి వేణుంభాకం గ్రామంలో పేరుకుపోయిన పారిశుధ్యం పరిశుభ్రపరిచి దళితవాడ,గిరిజన కాలనీ వాసులను సీజన్ వ్యాధుల బారి నుండి పడకుండా కాపాడి ఈ గ్రామంలో స్వచ్ఛభారత్ ఫ్రైడే డ్రై డే అలాంటి కార్యక్రమాలు అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ప్రాధేయ పడుతున్నారు.



## పేట సామాజిక వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

**- మంత్రికి వినతి పత్రం అందించిన రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బొల్లకాయల విజయ్ భాస్కర్**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణ, మండల పరిసరాల గ్రామాల్లోని డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నాయుడుపేట సామాజిక వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బొల్లకాయల విజయ్ కుమార్,పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం మంత్రి సత్య కుమార్ యాదవ్ పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు తిరుపతి ఎయిర్ పోర్టులో మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు. నాయుడుపేట మండల పరిసరాల డయాలసిస్ రోగులు అటు తిరుపతి,ఇటు నెల్లూరు నగరాలకు వెళ్లడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని,వారి సౌకర్యార్థం సి హెచ్ సి లో డయాలసిస్ చికిత్స కేంద్రం ఏర్పాటుచేసి రోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతేకాకుండా ప్రాంగణ ఆవరణంలోనే గతంలో ఏర్పాటు చేసి, నిరుపయోగంగా ఉన్న ట్రామా కేర్ సెంటర్ ను పునరుద్ధరించి దాని ద్వారా సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని వినతి పత్రంలో ప్రధాన అంశాలపై సమర్పించారు. వీటిపై మంత్రి సత్య కుమార్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బొల్లకాయల విజయ్ కుమార్, మాజీ జిల్లా కార్యదర్శి,సీనియర్ లాయర్ చెంచు కృష్ణయ్య, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పాల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, విశ్రాంతి పోలీసు ఉద్యోగి శాంసన్, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలి

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రాంతాలలో రెవిన్యూ శాఖకు కీలకంగా పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లకు న్యాయబద్ధమైన పదోన్నతులు కల్పించాలని సోమవారం జేఏసీ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి బల్లి విజయ్ కుమార్ జిల్లా అధ్యక్షురాలు పాల గిరిజ కళ్యాణి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే సందర్భంగా తాసిల్దార్ రాజేంద్ర కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ,ఎన్నో ఏళ్లగా రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా పనిచేస్తూ ఉన్నాము. మేము ప్రభుత్వాన్ని కోరి కోరికలు ప్రతి ఒక్క వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలి,వీఆర్ఏ నుండి వీఆర్వోలుగా 70 శాతం ప్రమోషన్ ఇవ్వాలి అటెండర్లు గా వాచ్ మెన్ గా కంప్యూటర్ ఆపరేటర్లుగా, వీఆర్వో గా ప్రమోషన్ కొరకు 20 శాతం నుండి 70 శాతం పెంచాలి,వన్ టైం సెటిల్మెంట్ 2008 జీవో ప్రకారం వీఆర్వోగా ప్రమోషన్ కేటాయించాలి. తెలిపారు. ప్రభుత్వం ఈ కోరికలు తీర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షులు తుమ్మ జయకృష్ణ, గోపాల్ జయశంకర్ రాజారత్నం, వెంకటేశ్వర్లు, బక్కయ్య, చెంచుకృష్ణ, వెంకటేష్, కృష్ణ స్వాతి స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరాలి

**- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండానే సేవలు వాళ్ళ వద్దకు తీసుకువెళ్లాలి**

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ప్రభుత్వ పథకాలు ఆవితులైన ప్రతి ఒక్కరికి చేరాలి ప్రజలు కార్యాలయాల చెట్టు చెరగోపరచిన అవసరం లేకుండానే సేవలు వాళ్ళ వద్దకు తీసుకువెళ్లాలి, "సర్కార్ ఆప్ కే ద్వారా" స్ఫూర్తితో సేవ చిట్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆయన సోమవారం సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా,ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సేవలను నేరుగా చేరువ చేసే సేవ సెట్ అభియాన్ --"సర్కార్ ఆపకే ద్వారా" కార్యక్రమంపై నిర్వహించిన జోన్-6 కోఆర్డినేషన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి,అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లకు చెందిన స్టేట్ అండ్ యూటీ కన్వీనర్స్, కో-కన్వీనర్స్‌తో సేవ సెట్ క్యాంప్స్ సేవ సెట్ కేంద్రాస్ ఏర్పాటు,అర్హులైన లబ్ధిదారులను గుర్తిం చడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, దరఖాస్తులకు సహకరించడం,అర్హత ఉన్నవారిని లబ్ధిదారులుగా నమోదు చేయడం వంటి అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిర గాల్సిన అవసరం లేకుండా సేవలను వారి వద్దకే తీసుకెళ్లే "సర్కార్ ఆపకే ద్వారా "స్ఫూర్తితో సేవ సెట్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సమన్వయకర్తలు సమష్టిగా పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## విశ్రాంతి విద్యుత్ శాఖ ఏడిఈ లింగారెడ్డి జయరామిరెడ్డి మృతి



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** దీర్ఘకాలంగా విద్యుత్ శాఖలో ఏఈగా విధులు నిర్వహించి, ఏడిఈ గా రైతులకు శాఖా పరంగా సేవలందించి, విశ్రాంతి ఉద్యోగిగా శేష జీవితం గడిపిన లింగారెడ్డి జయరామిరెడ్డి (81)సోమవారం అనారోగ్య కారణంగా తుది శ్వాస విడిచారు. దొరవారిసత్రం, పెళ్ళకూరు, నాయుడుపేట, చిట్టమూరు, 33 ఏళ్లు విద్యుత్ శాఖలో విశిష్ట సేవలు అందించారు. సొంత మండలమైన దొరవారిసత్రంలోనే సుదీర్ఘకాలంగా14 ఏళ్ళు విధులు నిర్వహించి అందరి మన్ననలను పొందాడు. ఈయన మరణ వార్త విన్న ఆ శాఖ అధికారులు, ఆయనతో పనిచేసిన సిబ్బంది పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి నాయుడుపేట పాత తాసిల్దార్ కార్యాలయ సమీపంలోని ఆయన నివాసం నుండి అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుందని కుమారుడు భాను ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.




## అల్లు అర్జున్ 'రాకా'.. విడుదలకు ముందే వరల్డ్ రికార్డ్..

## గిన్నిస్ బుక్ లో స్థానం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'రాకా' సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. విడుదలకు ముందే ఈ చిత్రం "మోస్ట్ పీపుల్ మోషన్-క్యాప్చర్డ్ ఇన్ రియల్-టైమ్" (ఒకే సమయంలో అత్యధిక మందిని మోషన్ క్యాప్చర్ చేయడం) విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ అరుదైన ఘనత భారతీయ సినిమాను ప్రపంచ వేదికపై మరో మెట్టు ఎక్కించిందని చిత్ర వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఒకేసారి 37 మంది పెర్ఫార్మర్లతో రియల్ టైమ్ మోషన్ క్యాప్చర్‌ను ఏకకాలంలో చిత్రీకరించి ఈ ఘనత సాధించినట్లు తెలిపింది. ఈ చారిత్రాత్మక విజయానికి గుర్తుగా అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. దర్శకుడు అట్లీ తన పుట్టినరోజు జరుపుకుంటున్న రోజే ఈ ప్రకటన రావడం విశేషం. ఈ సందర్భంగా అట్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అల్లు అర్జున్, ఆయనతో కలిసి మరిన్ని అద్భుతాలు సృష్టించడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిద్దరూ నవ్వుతూ ఉన్న ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను కూడా షేర్ చేశారు. ఇటీవల అల్లు అర్జున్ పుట్టినరోజున విడుదలైన 'రాకా' ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. గుండుతో, కఠినమైన ముఖ కవళికలతో, తోడేలు పంజా ముఖంపై ఉన్నట్లు కనిపించిన అల్లు అర్జున్ లుక్ ఒక యోధుడిని తలపించింది. ఈ ప్రాజెక్ట్‌ను గతేడాది ప్రకటించినప్పుడే, ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేస్తారని సన్ పిక్చర్స్ స్పష్టం చేసింది. 'ఐరన్ మ్యాన్ 2', 'ట్రాన్స్‌ఫార్మర్స్' వంటి చిత్రాలకు పనిచేసిన వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ జేమ్స్ మాడిగన్.. స్క్రిప్ట్ చదివాక తన తల తిరుగుతోందని వ్యాఖ్యానించారు. అలాగే, అకాడమీ అవార్డు గ్రహీత జస్టిన్ రాలీ వంటి ప్రముఖులు ఈ సినిమా సాంకేతిక బృందంలో భాగమయ్యారు. ఈ చిత్రాన్ని విశ్వవ్యాప్త ప్రేక్షకులు మెచ్చేలా తీర్చిదిద్దుతున్నామని మేకర్స్ చెబుతున్నారు. తాజా రికార్డుతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## నెగెటివిటీకి ఈ సినిమానే సమాధానం..

# 'ప్యారడైజ్'పై నాని ధీమా



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ది ప్యారడైజ్(ఎష్ట్రవ్రాఖుతీుఃఅంవ)'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా న్యాచురల్ స్టార్ నాని విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**జడల్ క్యారెక్టర్ గురించి చెప్పగానే ఏమనిపించింది?**

కథలో నుంచి వచ్చిన లుక్ అది. చాలా కొత్తగా అనిపించింది. ఇందులో క్యారెక్టర్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. ఆ క్యారెక్టర్‌కు బిగినింగ్ నుంచే ఒక మ్యాడ్నెస్ ఉంటుంది. నిజానికి తెలుగులోనే ఇలాంటి క్యారెక్టర్ చాలా కొత్త. నా మీద ఆ క్యారెక్టర్ ఫ్రెష్‌గా ఉంటుంది. జడలతో లుక్ చూసి సర్‌ప్రైజ్ అయ్యారు. ఇందులో ప్రతి డీటెయిల్‌కు ఒక కారణం ఉంటుంది. ఇందులో మీరు చూస్తుంది సవారీల బొట్టు. ఎవరినైనా బలవంతంగా తీసుకెళ్లి టాటూ వేస్తే వాడు సవారీ అయిపోయినట్టే. అలాగే ముక్కుపుడక, చైను అన్నిటికీ ఒక ఇంపార్టెన్స్ ఉంటుంది.

**మీ సినిమాలంటే ఫ్యామిలీ ఆడియన్స్ కదా.. ఈ సినిమా ఎలా ఉంటుంది?**

-ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ చూసే సినిమా ఇది. మదర్ -సన్ ఎమోషన్ అద్భుతంగా ఉంటుంది. ఫ్యామిలీస్ అందరూ కలిసి హ్యాపీగా చూడొచ్చు. ప్రేక్షకుల అంచనాలని అందుకుంటుంది. మాస్, యాక్షన్ థియేటర్ అదిరిపోయేలా ఉంటుంది. నా కెరీర్‌లోనే ఎక్కువ హార్డ్ వర్క్ చేసిన సినిమా ప్యారడైజ్.

**మోహన్‌బాబు గారి క్యారెక్టర్?**

శ్రీకాంత్ కథ చెప్పినప్పుడే మోహన్‌బాబు గారు అయితే బాగుంటుంది అని అన్నాడు. శ్రీకాంత్ కథ చెప్పడానికి మోహన్ బాబు గారి దగ్గరికి వెళ్లాడు. ఆయన చాలా ఎక్సైట్మెంట్ ఫీల్ అయ్యారు. ఈ కథ విన్నప్పుడే ఇది చాలా పెద్ద సినిమా అవుతుందని నమ్మిన మొదటి వ్యక్తి మోహన్ బాబు గారు.

**పాన్ ఇండియా ప్రమోషన్స్ గురించి?**

ఈ సినిమా కంటెంట్ అన్ని ప్రాంతాల్లో రీచ్ అయ్యి ఉంది. అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారు. తమిళ్, హిందీ, కన్నడ, మలయాళం ప్రేక్షకులు ఎంతో ప్రేమను ఇస్తున్నారు.

**ఎక్కువగా డ్యాన్స్ చేశారు కదా?**

శ్రీకాంత్ దృష్టిలో నేను పెద్ద డ్యాన్సర్ని (నవ్వుతూ). నువ్వు డ్యాన్స్ చేస్తే మస్తు ఉంటది అన్న అని చెప్తుంటాడు. నేను డ్యాన్స్ చేస్తుంటే చాలా ఎంజాయ్ చేస్తాడు. శ్రీకాంత్ కోసం చేయాలనుకున్నాను. తన నమ్మకం నిజమైంది. పాటలు రిలీజ్ అయిన తర్వాత అందరూ సర్‌ప్రైజ్ అయ్యారు. ఇందులో మరో పాట 'అంజనా అంజనీ' త్వరలోనే రిలీజ్.

**మదర్ సెంటిమెంట్ గురించి?**

మా గ్లింప్స్ రిలీజ్ చేసినప్పుడు ఒక తల్లి తన కొడుకు గురించి చెప్పే కథగా మొదలు పెట్టాము. టీజర్లో కూడా మెయిన్ ఎలిమెంట్ మదర్ మీదే కట్ చేశాము. సినిమా మొదలయ్యేదే మదర్ ఎమోషన్‌తో. మదర్‌తో ఎండ్ అవుతుంది. అది మీకు హ్యాంగోవర్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. మూడు, నాలుగు రోజులు 'ప్యారడైజ్' మీ మైండ్ నుంచి వెళ్లదు.

**'ప్యారడైజ్' అనే ప్లేస్ గురించి?**

'ప్యారడైజ్' అనే ప్లేస్లో సవారి అనే ఒక ట్రైబ్‌కు సంబంధించిన కథ ఇది. అక్కడ సవారీలకు గుర్తింపు లేదు. వాళ్ల ఉనికిని కూడా ఎవరు పట్టించుకోరు. వాళ్లని చంపేసినా సరే కేసు కూడా పెట్టరు. ఐడెంటిటీ కోసం చేసిన ఒక తిరుగుబాటు. 1984 టైమ్లైన్ మధ్య ఉంటుంది. సినిమా చూస్తున్నప్పుడు ప్యారడైజ్ ప్రపంచంలోకి వెళ్లిపోతారు.

**రిస్కీ షాటు.. గాయాల గురించి?**

నాకు ఇష్టం, ఓపిక ఉన్నాయి. అన్ని నేనే స్వయంగా చేశాను. ఇంకో 15 ఇయర్స్ తర్వాత డూప్‌కు అప్పచెప్తానేమో (నవ్వుతూ). డూప్ చేస్తే నేను ఎంజాయ్ చేయలేను. అది నా ప్రాబ్లం. డైరెక్షన్ డిపార్ట్మెంట్ అందరికీ చెప్తాను సినిమాలో లెగ్ షాట్ అయినా, హ్యాండ్ కనిపించే షాట్ అయినా నేనే స్వయంగా చేస్తా. స్క్రీన్ మీద చూసుకున్నప్పుడు 'అబ్బా.. ఇది డూప్ షాట్' అని అనిపిస్తే ఆ కాంప్లిమెంట్ను నేను జెన్యూన్గా తీసుకోలేను.

**హీరోయిన్, నిర్మాత గురించి?**

హీరోయిన్ క్యారెక్టర్ చాలా సాలిడ్‌గా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఎమోషనల్ స్టోరీ ఆర్క్ చాలా ఇంపార్టెంట్. ఫైనల్ అవుట్‌పుట్ విషయంలో, బిజినెస్ విషయంలో ఆయన చాలా హ్యాపీగా ఉన్నారు. అనుకున్న సమయంలో రిలీజ్ చేయడానికి అందరం ఒత్తిడి తీసుకున్నాం. అందరూ 24 గంటల పాటు పనిచేశారు. ఇప్పటికే సినిమా ఒకటి రెండు సార్లు వాయిదా పడాల్సి వచ్చింది. ఈసారి అనుకున్న సమయానికి ఎట్టి పరిస్థితుల్లో తీసుకురావాలని, క్వాలిటీ కాంప్రమైజ్ కాకుండా ఇవ్వాలని మేము అహర్నిశలు పని చేశాం.



## జపాన్‌తో తొలి టీ20..

# ఇది థ్రిల్లింగ్ ఛాలెంజ్: శ్రేయస్ అయ్యర్



అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయానికి టీమిండియా శ్రీకారం చుట్టనుంది. చరిత్రలో తొలిసారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే, ఈరోజు సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగాల్సిన భారత జట్టు ప్రాక్టీస్ సెషన్ భారీ వర్షం కారణంగా రద్దయింది. అయినప్పటికీ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం పూర్తి ఉత్సాహంతో ఉన్నాడు. తెలియని ప్రత్యర్థితో వారి గడ్డపై ఆడటం ఒక 'థ్రిల్లింగ్ ఛాలెంజ్' అని అతను అభివర్ణించాడు. అంతకుముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "తొలిసారిగా జపాన్‌తో ఆడుతున్నాం. ఇది మాకు ఎంతో థ్రిల్లింగ్‌గా, ఉత్సాహంగా ఉంది. ఇక్కడి పరిస్థితులు, వికెట్ గురించి మాకు పెద్దగా అవగాహన లేదు. అయినా ఒక మంచి మ్యాచ్ ఆడాలని ఎదురుచూస్తున్నాం" అని తెలిపాడు.

**వీడియో క్లిప్పులతో ప్రత్యర్థిపై అధ్యయనం**

జపాన్ జట్టుతో ఇంతకుముందెన్నడూ తలపడనందున, వారి ఆటగాళ్ల బలాబలాలను అంచనా వేయడానికి భారత టీమ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీని ఆశ్రయిస్తోంది. ప్రత్యర్థి ఆటగాళ్లకు సంబంధించిన వీడియో ఫుటేజ్, డిజిటల్ క్లిప్పులను నిశితంగా పరిశీలిస్తోంది. "నేను వారికి సంబంధించిన కొన్ని రీల్స్ చూశాను. మేము వారి ఆటగాళ్ల గురించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బరిలోకి దిగుతాం. రేపటి మ్యాచ్‌కు వర్షం అడ్డుపడదని, అభిమానులందరూ ఒక మంచి పోటీని చూస్తారని ఆశిస్తున్నా" అని అయ్యర్ పేర్కొన్నాడు.

**జపాన్ సంస్కృతి, ఆతిథ్యానికి ఫిదా**

పాతతరం క్రికెట్ దేశాలకు భిన్నంగా జపాన్‌లో పర్యటించడం ఒక కొత్త అనుభూతినిస్తోందని అయ్యర్ చెప్పాడు. "ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ వంటి పర్యటనలకు ఇది పూర్తిగా భిన్నమైనది. జపాన్ రావడం ఇదే తొలిసారి. ఇక్కడి ప్రజలు, సంస్కృతి, క్రమశిక్షణ అన్నీ కొత్తగా ఉన్నాయి. కొత్త సంస్కృతులను ఇష్టపడే నాకు ఇది బాగా నచ్చింది. భారత్, జపాన్ మధ్య స్నేహబంధం బలపడుతోంది. నాకు 'అరిగాటో', 'కొనిచివా' అనే రెండు జపనీస్ పదాలు తెలుసు" అంటూ నవ్వేశాడు. జపాన్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజలు ఎంతో ఆప్యాయంగా, సహాయం చేసే గుణంతో ఉన్నారని, వారి ఆతిథ్యం అద్భుతంగా ఉందని ప్రశంసించాడు.

**క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది**

క్రికెట్ ఆడని దేశాలు కూడా ఇప్పుడు ఈ ఆటను వేగంగా అందిపుచ్చుకుంటున్నాయని అయ్యర్ వ్యాఖ్యానించాడు. "నేను దీని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఇప్పుడు క్రికెట్ ప్రతి దేశంలోనూ ప్రాచుర్యం పొందుతోంది. అన్ని జట్లు తమదైన శైలిలో రాణిస్తున్నాయి. జపాన్‌తో మ్యాచ్ కూడా ఆసక్తికరంగా ఉంటుందని నేను నమ్ముతున్నా" అని అన్నాడు. భారత్‌లో యువ తారలు వెలుగులోకి రావడానికి ఐపీఎల్ ఒక గొప్ప వేదిక అని అయ్యర్ అభిప్రాయపడ్డాడు. "మా జట్టులోని యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చాడు. ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక బలమైన వేదిక. ఐపీఎల్‌లో రాణిస్తే అందరి దృష్టి మీపై ఉంటుంది. తద్వారా భారత జట్టులోకి రావడానికి అవకాశాలు మెరుగవుతాయి" అని వివరించాడు.




## సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్..

# ధోనీ నిర్ణయమన్న కాశీవిశ్వనాథ్

ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ నూతన ప్రధాన కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను నియమించింది. గత 18 ఏళ్లుగా జట్టుతో అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐపీఎల్ 2027 సీజన్ వరకు ఈ నియామకం అమల్లో ఉంటుందని ఫ్రాంచైజీ సోమవారం వెల్లడించింది. ఈ కీలక నిర్ణయంలో వెటరన్ సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ ప్రధాన పాత్ర పోషించినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నియామకంపై సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ, "క్రికెట్ మేనేజ్‌మెంట్ సమష్టిగా ఈ నిర్ణయం తీసుకుంది. జహీర్ ఖాన్‌కు ఉన్న అపార అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని అతడిని ప్రధాన కోచ్‌గా ఎంపిక చేశాం. ఐపీఎల్‌లో వందకు పైగా మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతడికి ఉంది. ఈ ఎంపిక ప్రక్రియలో ఎంఎస్ ధోనీ కూడా పాలుపంచుకున్నాడు. ధోనీ సలహా లేకుండా మేం ఎటువంటి నిర్ణయాలు తీసుకోం" అని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు యజమాని రూపా గురునాథ్ కూడా భాగస్వాములయ్యారు. 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడైన జహీర్ ఖాన్, గతంలో ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా సేవలందించాడు. ఒక ఐపీఎల్ జట్టుకు అతడు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి. తన సహాయక సిబ్బందిని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను జహీర్‌కు కల్పించినట్లు యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుత ఒప్పందం ప్రకారం ఏడాది కాలానికి ఈ నియామకం జరిగినట్లు సమాచారం. ఇక ధోనీ భవిష్యత్తు గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "అతడు మా జట్టులో ఆటగాడిగానే కొనసాగుతాడు" అని విశ్వనాథన్ బదులిచ్చారు. గత మూడు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన సీఎస్‌కే, జహీర్ మార్గదర్శకత్వంలో తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆశిస్తోంది. డిసెంబర్‌లో జరగనున్న మినీ వేలం ద్వారా పటిష్ఠమైన జట్టును సిద్ధం చేయడం ఇప్పుడు జహీర్ ముందున్న తక్షణ కర్తవ్యం.

# దోమల పెరుగుదలను అరికడదాం!

**- జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం**
**- దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా , మెదడువాపు, బోదవ్యాధి, వంటి వ్యాధులు రాకుండా కాపాడుకుందాం**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** రాయచోటి మండలం యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్వర్ణ మాధవరం-2 గ్రామ సచివాలయం పరిధిలోని మూలపల్లె ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఉదయం జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆ తర్వాత గురికానివారిపల్లె, తమలంవారి పల్లె,మల్లెంవాండ్లపల్లె లందు ఆరోగ్య సిబ్బంది ఇంటింటా దోమల లార్వా సర్వేని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ దోమల రకాలు, అవి వ్యాప్తి చేయు వ్యాధుల గురించి వివరించడం జరిగింది. దోమ జీవిత చరిత్ర గురించి తెలిపారు.మంచి నీటి నిల్వలలో పెరిగే అనాఫిలిస్ దోమ మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయని, ఇంటి పరిసరాల్లోని చిన్న చిన్న నీటి నిల్వలలో పెరిగే ఏడిస్ దోమ డెంగీ, చికున్ గున్యా వ్యాధిని వ్యాప్తి చేస్తాయని,మురికి నీటి నిల్వలలో పెరిగే క్యూలెక్స్ దోమ బోదవ్యాధి. మెదడువాపు వ్యాధిని వ్యాప్తి చేస్తాయని ఆయన తెలిపారు.దోమల వ్యాప్తిని అరికట్టుటకు తీసుకోవలసిన చర్యలు గురించి వివరిస్తూ ఇంటి వద్ద ఉన్న మురికి కాలువలో చెత్త చెదారం వేయకూడదని,మురికి నీరు ఎప్పుడూ పారునట్లు చూడాలని, కొళాయిల లీకేజి అరికట్టడం లేకపోయినచో నీరు నిలిచి దోమల ఉత్పత్తి జరుగునని ఆయన వివరించారు.ఎయిర్ కూలర్ లోని నీటిని వారానికి ఒకసారి మార్చాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువకుండా చూడాలని,మురికి నీరు నిల్వలో వారాని కొకసారి కిరోసిన్ ఆయిల్ లేక వాడిన ఇంజను ఆయిల్ చల్లి దోమల పుట్టుక వుండేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.ప్రతి ఇంటి పరిసరాలలో పనికిరాని పడవేసిన తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరిచిప్పలు మొదలగు వాటిలో వర్షపు నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగునని,అలాంటి వాటిని తొలగించాలని తెలిపారు. గంబూజియా, గప్పి అను చిన్న చిన్న చేపలు నీటి స్థావరాలైన బావులు, కుంటలు వగైరాల యందు వదిలినట్లయితే దోమలు పుట్టవని,నీటిలో వున్న దోమల లార్వాలను ఈ చేపలు తిని బ్రతుకుతాయని ఆయన తెలిపారు .ఇంటి పైకప్పు పైన వున్న ట్యాంకులకు మూత అమర్చాలని,లేకపోతే దోమలు గ్రుడ్లు పెట్టి పెరుగుతాయని ఆయన తెలిపారు.నీటిని వారానికి పైగా నిలువ నివ్వ కూడదని, వారానికి ఒకసారి నీరు మార్చి నింపుకున్నట్ల యితే దోమల బెడద వుండదని తెలిపారు. భవన నిర్మాణ ప్రదేశాలలో నీరు స్టోర్ చేయడం జరుగునని,అలాంటి ప్రదేశాలలో దోమలు పుడతాయని, కావున వారాని కొకసారి నీరు మార్చి నిలుపుకోవాలని, లేకపోతే గంబూజియా చేపలను ఆ నీటి స్థావరాలలో వదలాలని తెలిపారు. పూలకుండీలలో, ఇంటి పైకప్పుపై నీరు నిలువ ఉండ కూడదని,సెప్టిక్ ట్యాంకు గ్యాస్ పైపులకు జాలీలు మార్చాలని,ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడే పాటించి అన్ని నీటి నిల్వలను, పాత్రలను శుభ్రపరిచి తిరిగి నీరు నింపుకోవలెనని, పనికిరాని, వాడని వస్తువులను ఇంటిపైన ఇంటి పరిసరాలలో లేకుండా షెడ్డు, గొడౌన్, స్టోర్ రూమ్ లలో వుంచుకోవలెనని ఆయన తెలిపారు. దోమల బెడద నుండి రక్షణ పొందుటకు దోమతెరలు వాడవలెనని, ఇంటి పరిసరాలలో వీధులలో ఫాగింగ్ చేయించు కోవాలని, దోమల నియంత్రణ కార్యక్రమములో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ విభాగం ఇచ్చే సూచనలు మరియు సలహాలు పాటించి దోమ కాటు నుండి తద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులు నుండి రక్షణ పొందాలని తెలిపారు. దోమల నియంత్రణ మనందరి బాధ్యతని, ఇంటికి దోమల మందు పిచికారి చేయించాలానిదోమ తెరలు విధిగా వాడాలని ఆయన తెలిపారు. ప్రజలకు మంచి నీటి డ్రమ్ములు పైన మూతలు పెట్టుకోవాలని, అవి లేనప్పుడు సంచిపట్టగాని,గుడ్డతో గాని దోమలు ప్రవేశించకుండా ఉండే విధంగా కట్టుకోనే విధం చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి.సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాలగిరి పక్కిర, ఆశా కార్యకర్త గీత రాణి తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 25న మెగా జాబ్ మేళా

**- పోస్టర్లు ఆవిష్కరించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీ ఎస్ఎస్డి సి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25, 2026న పీలేరు ఎస్జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. శ్యామ్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో 10కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని, వివిధ విభాగాల్లో 500కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమలతో ప్రత్యక్షంగా అనుసంధానం కల్పించి, వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

స్థలం: ఎస్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మదనపల్లె రోడ్, పీలేరు, అన్నమయ్య జిల్లా తేదీ: 25-09-2026.అవకాశాలు: 5000 ఉద్యోగ ఖాళీలు, పాల్గొనే కంపెనీలు: 100 కంపెనీలు, అర్హత కలిగిన డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇతర విద్యార్హతలు కలిగిన ఉద్యోగార్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, తాజా రెజ్యూమ్, అవసరమైన గుర్తింపు పత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిఎస్డిఓ అన్నమయ్య ఎన్.శ్యామ్ మోహన్ సూచించారు. అలాగే, యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయడంలో భాగంగా ఏపీ ఎస్-ఎస్డిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని జిల్లాలోని ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## విశ్వకర్మ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యాలయం వద్ద శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం 8వ తరం 12వ మఠాధిపతులు శ్రీశ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు, ధర్మపత్ని ఉమాదేవి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మఠాధిపతులకు నిర్వాహకులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వాములవారు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మఠాధిపతులు విశ్వకర్మ భగవాన్ మహత్యం, విశ్వసృష్టిలో ఆయన ప్రాధాన్యత, విశ్వబ్రాహ్మణుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రవచనం చేశారు. భక్తులు విశ్వకర్మ భగవాన్ ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ప్రతినిధులు, నాయకులు, భక్తులు, విశ్వకర్మ సమాజ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ రఘురాంరెడ్డి!

**- కార్యకర్తలను వాడుకుని వదిలేయడమే ఆయన నైజం: ఎంపీపీ వీరనారాయణరెడ్డి**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి స్వార్థ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని, అవసరం ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలను నెత్తిన పెట్టుకుని.. అవసరం తీరిన తర్వాత కాళ్ల కింద తొక్కేయడమే ఆయన రాజకీయ నైజమని బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీర నారాయణరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ఈ నెల 24తో ముగియనున్న నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన మంచితనాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారని, ఇకపై తనేమిటో చూపిస్తానని హెచ్చరించారు. తన సన్మాన కార్యక్రమానికి కొందరు వ్యక్తులు ఎంపీటీసీలను రాకుండా అడ్డుకున్నారని, ఇది వారికి ఒక హెచ్చరిక అని అన్నారు. జడ్పీటీసీ స్వార్థ రాజకీయాల కోసం గతాన్ని మరిచిపోయారని ఆరోపించారు.

**నీ వల్ల బాగుపడిన కార్యకర్త ఒక్కరైనా ఉన్నారా?**

మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి తీరుపై ఎంపీపీ ఘాటుగా స్పందించారు. "మైదుకూరు నియోజకవర్గంలో రఘురాంరెడ్డి ద్వారా రాజకీయంగా బాగుపడిన ఒక్క వ్యక్తినైనా చూపించగలరా?" అని ప్రశ్నించారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచడమే ఆయన రాజకీయ సిద్ధాంతమని విమర్శించారు. కమిషన్ల కోసం పనులు ఇప్పించడం, పనులు పూర్తయిన తర్వాత బిల్లులు రాకుండా అడ్డుకోవడం ఆయన నైజమని ఆరోపించారు.మండలంలో కార్యక్రమాలకు టపాసులు, భోజనాలు, సభలు, సమావేశాలకు జన సమీకరణ, వాహనాల ఏర్పాటుకు సొంత డబ్బును ఖర్చు చేశానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసి అప్పుల పాలయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు ఇచ్చినట్లే ఇచ్చి, బిల్లులు రాకుండా మాజీ ఎమ్మెల్యే అడ్డుకున్నారని ఆరోపించారు."పాము తన పిల్లలను కని, కళ్లు కనిపించక తన పిల్లలనే కరిచినట్లు ఆయన వ్యవహారం ఉంది" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి రాజకీయాల్లోకి రావాలంటే ముందుగా ఆర్థికంగా స్థిరపడాలని, తన కడుపులోనే ఆకలి ఉంటే ఇతర కార్యకర్తల కడుపు ఎలా నింపగలడని ప్రశ్నించారు.

**సుధాకర్‌యాదవ్ నిజాయితీ నచ్చే ఆయన వెంట వెళ్లా**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌పై ఎంపీపీ వీరనారాయణరెడ్డి ప్రశంసలు కురి పించారు. సుధాకర్‌యాదవ్ రఘురాంరెడ్డి తరహా వ్యక్తి కాదని, రాజకీయాల్లోకి రాకముందే ఆర్థికం గా స్థిరపడి, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారని అన్నారు. ఆయన నిజాయితీ నచ్చే తాను ఆయనకు మద్దతుగా నిలిచానని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీపీ వీరనారాయణరెడ్డి మండల అధికారులను ఘనంగా సన్మానించారు. అధికారులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన పవన్ కళ్యాణ్ గ్రేట్!

**-జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్**




**రాయచోటి- సూర్య వాస్తవం:** పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం దాదాపు1,500 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు 'ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రేట్'అని జనసేన పార్టీ రాయచోటి నియోజక వర్గ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ లో ఇంతవరకు ఇంత పెద్ద మొత్తం అంచనా వ్యయం దాదాపు రూ. 1,500 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు గత డిప్యూటీ సీఎంలు ఎవరు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయలేదని ఆయన చెప్పారు.ఏపీ డిప్యూటీ సీఎం గా ఆంధ్రప్రదేశ్ చరిత్రపుటల్లో పవన్ కళ్యాణ్ పేరు నిలిచిపోతుందని ఆయన చెప్పారు. రాయలసీమ లోని అన్నినియోజకవర్గాల, గ్రామీణాభివృద్ధి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం, ఫారెస్ట్ డెవలప్మెంట్ కొరకు జనసేన పార్టీ అధ్యక్షుడిగా, ఏపీ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా జనసేన నాయకుడు మన్సూర్ అలీ ఖాన్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు షేక్ దర్బార్ భాష, అత్తార్ యహియా భాష, షేక్ జిలాన్ పాల్గొన్నారు.

## సుగవాసి ప్రసాద్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి మైనార్టీ మహిళ



**రాయచోటి-సూర్య వాస్తవం:** టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబుని రాయచోటి పట్టణంలోని ప్రీతం లాడ్జి పక్కన ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో సోమవారం టిడిపి మహిళ నాయకురాలు అఫ్రీన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూల బొకే ఇచ్చి ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ రాష్ట్రానికి అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం, మహిళల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి మహిళలకు, ప్రజలకు బాగా వివరించి ప్రచారం చేపట్టాలని చెప్పారు. కష్టపడి పనిచేసే ప్రతి టిడిపి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుంది అని ఈ సందర్భంగా ప్రసాద్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో అఫ్రీన్ కుమారుడు ముస్తాక్ పాల్గొన్నారు.

## 400 బస్తాలు ఉలవలు పంపిణీ



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:**అన్నమయ్య జిల్లా సిబ్యాల.కూటమి ప్రభుత్వం మరియు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ ఆదేశాల మేరకు. సిబ్యాల గ్రామ సచివాలయంలో రైతులకు దాదాపు 400 ఉలవలబస్తాలను. రాయచోటిమార్కెట్. కమిటీచైర్మన్ అనుంపల్లి.రాంప్రసాద్‌రెడ్డి. రైతులకు పంపిణీచేశారు.సిబ్యాల గ్రామంలో సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు పంటలు వేసుకోవడానికి సిబ్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో అనుశీపల్లి రాంప్రసాద్ రెడ్డి ఉలవలు పంపిణీ చేస్తున్న. కార్యక్రమంలో.రైతులు.పాల్గొనిఉలవలను.తీసుకెళ్లారు.కూటమి ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తుందని. రైతులు అన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**- తెలుగుదేశం పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనుమల ఖాదరవల్లి**

**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణంలోని బోస్ నగర్‌లో వక్రతుండా మహాకాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని శిబిరానికి ఆదివారం తెలుగుదేశం పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనుమల ఖాదర్ వలీ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు కమిటీ సభ్యులు శాలువా కప్పి , పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా ఖాదరవల్లి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ వక్రతుండ మహాకాయ ఉత్సవ కమిటీ సభ్యులువాకా రెడ్డి కుమార్, గన్న వెంకటరమణ, లక్ష్మీనారాయణపూజారి కృష్ణయ్య భువన్ ,చరణ్,పురుషోత్తం ,షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# ఉరవకొండలో విషాదం..

- విద్యుదాఘాతంతో ఎనిమిదేళ్ల బాలుడు మృతి...!
- వినాయక మండపంలో ఆడుకుంటుండగా ప్రమాదం
- అనంతపురంలో చికిత్స పొందుతూ మృతి
- ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండలో గణనాథుని మండపం వద్ద ఆదివారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుని ఎనిమిదేళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన లంబోదర వినాయక మండపంలో కొంతమంది చిన్నారులు ఆడుకుంటున్నారు. అదే కాలనీలోని ఎనిమిదో వీధికి చెందిన మౌనిక, సోమనాథ్ దంపతుల కుమారుడు సాత్విక్ (8) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు.వెంటనే గమనించిన స్థానిక యువకులు బాలుడిని చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సాత్విక్ మృతి చెందాడు. బాలుడిని ప్రాణాలతో కాపాడేందుకు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు భరత్, నర్సులు సీపీఆర్ చేస్తూ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన తల్లి కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడున్న వారిని కలిచివేసింది. ఈ ఘటనతో ఇందిరానగర్‌లో విషాదఛాయలు అలుము కున్నాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ మహానంది తెలిపారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

-అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి.
జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అందరి సహకారంతో అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించనున్న 'మొబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ వ్యాప్తికి అధిక అవకాశాలు ఉన్న హైరిస్క్ వ్యక్తులను గుర్తించి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వినియోగించేలా అవసరమైన అవగాహన కల్పించా లని తెలిపారు. ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షా కిట్లు, ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో మొదటి,రెండో మరియు మూడో లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డీసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీఎల్‌టీఓ డాక్టర్ రాధిక, సీపీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని గజరాంపల్లి గ్రామంలోని వైసీపీ నాయకుడు మాజీ మండలా ధ్యక్షుడు జంగం పెద్ద పుల్లారెడ్డి గుండె చికిత్స చేయించుకున్నందున ఆయన స్వగృహమునకు గుత్తి మాజీ ఎమ్మెల్యే కొట్రికే. మధుసూదనగుప్తా వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీపీ జంగం పెద్దపుల్లారెడ్డి,ఆయన కుమారుడు మాజీ సర్పంచ్ దేవేంద్రయాదవు వారి కుటుంబం నాకెంతో ఆత్మీయులని ఆయన త్వరగా కోలుకొని యధా ప్రకారం ప్రజాసేవలు నిర్వహించాలని ఆ దేవుడిని కోరుకొను చున్నానన్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ వైసీపీ నాయకులు తిప్పారెడ్డి దేవానందరెడ్డి దేవేంద్ర తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ముత్తూట్ ఫైనాన్స్‌పై విచారణ జరపాలి

- ఎన్ఎస్‌డీఎల్ చెల్లింపుల పేరుతో ఖాతాదారులకు ఇబ్బందులు
- ఆర్‌బీఐ దృష్టి సారించాలన్న ఏఐవైఎఫ్
- కోరిన బ్యాంకు ఖాతాల్లోకే నగదు బదిలీ చేయాలని డిమాండ్
- లావాదేవీల్లో పారదర్శకత పాటించాలని హితవు
- ఐదు నెలలుగా సమస్యలు ఎదురవుతున్నాయన్న ఆరోపణ
- టార్గెట్లు, కమీషన్ల కోసమేనా? అని ప్రశ్న
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావలి కోట్రేష్






**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారు రుణాలు పొందుతున్న ఖాతాదా రులకు ఎన్ఎస్‌డీఎల్ ఆన్‌లైన్ పేమెంట్ విధానం ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావలి కోట్రేష్ ఆరోపించారు. లావాదేవీల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందేందుకు వచ్చే ఖాతాదారులకు ఇప్పటికే ఎస్‌బీఐ, కెనరా, హెచ్‌డీఎఫ్‌సీ, ఏపీజీబీ తదితర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నప్పటికీ ఎన్ఎస్‌డీఎల్ ఆన్‌లైన్ పేమెంట్ విధానంలో నగదు బదిలీ చేస్తున్నారని కోట్రేష్ తెలిపారు. నగదు బదిలీకి సంబంధించిన పరిమితులు, విధానాలను ఖాతాదారులకు ముందుగానే స్పష్టంగా తెలియజేయాలని కోరారు.ఈ నెల 18న ఓ ఖాతాదారుడు 4.5 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.4.50 లక్షల రుణం పొందిన సందర్భంలో సమస్య తలెత్తిందని ఆయన పేర్కొన్నారు. రోజువారీ లావాదేవీ పరిమితి గురించి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా మొత్తం నగదును ఎన్ఎస్‌డీఎల్ ఖాతాలో జమ చేయడంతో రూ.2.52 లక్షలకు పైగా మొత్తం అదే రోజు బ్యాంకు డిడక్షన్ పేరుతో కట్ అయిందని ఆరోపించారు. దీనిపై ఖాతాదారు ప్రశ్నించగా, తానే లావాదేవీ చేసినట్లు సిబ్బంది చెప్పారని తెలిపారు. శనివారం రెండు గంటల్లో నగదు జమ చేస్తామని చెప్పినా జరగలేదని, అనంతరం సోమవారం జమ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా నగదు జమ కాకపోవడంతో ఖాతాదారు ఆందోళన వ్యక్తం చేసిన తర్వాతే నగదు జమ చేశారని కోట్రేష్ ఆరోపించారు.

**ఐదు నెలలుగా ఇదే సమస్య:**
ఈ సమస్య ఒక్క ఖాతాదారుడికే పరిమితం కాలేదని, గత ఐదు నెలలుగా పలువురు ఖాతాదారులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోట్రేష్ పేర్కొన్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలు లేదా కమీషన్ల కారణంగానే ఈ విధానం అమలు చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**ఆర్‌బీఐ విచారణ చేయాలి:** ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో జరుగుతున్న నగదు, ఆన్‌లైన్ లావాదేవీలపై ఆర్‌బీఐ అధికారులు దృష్టి సారించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఖాతాదారులకు సంబంధించిన లావాదేవీల్లో పూర్తి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

ఏఐవైఎఫ్ డిమాండ్లు:ముత్తూట్ ఫైనాన్స్‌లో ఎన్ఎస్‌డీఎల్ ఆన్‌లైన్ పేమెంట్ విధానంపై సమగ్రంగా పరిశీలించి, ఖాతాదారులకు వారు కోరిన బ్యాంకు ఖాతాల్లోకే నేరుగా నగదు బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ కోరింది. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల లావాదేవీలపై కఠిన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేసింది.
ఎన్ఎస్‌డీఎల్ పేమెంట్ విధానం వెనుక ఉన్న కారణాలు, దాని వల్ల ఖాతాదారులకు కలుగుతున్న ఇబ్బందులపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోట్రేష్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బాధితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి సూచనలతో నాయుడుపేట పట్టణం లోని ఐసీఐసీఐ బ్యాంక్ మిద్దెపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి సమావేశం, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సూళ్లూరుపేట శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,సంక్షేమ పథకాల అమలు, సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై మాట్లాడారు. "కూటమి ప్రభుత్వంపై విమర్శలు": -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, పోలీసుల ద్వారా వేధింపులకు గురిచేయడం జరుగుతోందని కిలివేటి సంజీవయ్య ఆరోపించారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులకు ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా కారణమవుతోందని ఆయన అన్నారు.సోమశిల--కండలేరు ప్రాంతాలకు నీటి లభ్యత కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నీటి కోసం రైతులతో కలిసి ఆందోళన చేసిన సందర్భాల్లో కేసులు నమోదు చేశారని ఆరోపించారు.పశుగ్రాసం కొరత, వ్యవసాయ ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

**"పెన్షన్లపై ప్రశ్నలు":** రెండేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోలేదని కిలివేటి సంజీవయ్య విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని,ఈ ప్రక్రియపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు అందేవని,ప్రస్తుత ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు.

"గృహ నిర్మాణంపై విమర్శలు":-కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గృహ నిర్మాణ రంగంలో కొత్తగా ఎన్ని గృహాలు మంజూరు చేశారో ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు.గృహ నిర్మాణానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై లబ్ధిదారులకు స్పష్టత ఇవ్వాలని అన్నారు.

**"సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధిపై విమర్శలు":**
సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి కోసం ప్రస్తుత ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చారని,అయితే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని కిలివేటి సంజీవయ్య విమర్శించారు.
నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రకృతి వనరుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఎమ్మెల్యే మరియు సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**"తిరుమల లడ్డూ అంశంపై వ్యాఖ్యలు":** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి సంబంధించిన అంశంపై గతంలో తీవ్ర రాజకీయ చర్చలు జరిగాయని కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు.ఈ అంశంపై అధికారిక సంస్థలు వెల్లడించే సమాచారాన్ని మాత్రమే ప్రజలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అన్నారు. టీటీడీ కూడా ప్రస్తుతం శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ,నాణ్యత నియంత్రణకు సంబంధించి కఠినమైన నాణ్యత ప్రమాణాలు,పరీక్షా విధానాలు అమలు చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది.

**"స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి"**
స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు,అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కిలివేటి సంజీవయ్య సూచించారు.ప్రతి వార్డులో,ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ప్రజలను కలుసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. అదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.సూళ్లూరుపేట నియోజక వర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాల్లో పార్టీ విజయానికి ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,జిల్లా సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి,జెట్టి వేణు యాదవ్,రైతు విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర సమ్యుక్తకార్యదర్శి పాలూరు దశరథరామి రెడ్డి,నాయుడుపేట మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,ఓజిలి మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు పాదర్తి హరినాథ రెడ్డి, పెళ్లకూరు మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం, దొరవారిసత్రం మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి,మాజీ ఎంపీపీలు గడ్డం అరుణ రెడ్డి,కురుగొండ్ల ధనలక్ష్మి, సూళ్లూరుపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కట్టా భవాని శంకర్ రెడ్డి, దొరవారిసత్రం మండల సీనియర్ నాయకులు వేణుంబాక మునిస్వామి నాయుడు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా, పట్టణ, మండల, గ్రామ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

